






సాయం సంధ్యలో.. రాజమహేంద్రవరంలోని గోదావరి తీరంలో బుధవారం సాయంత్రం సూర్యుడి అస్తమిస్తున్న వేళ కనువిందు చేసే దృశ్యం

నూతనోత్సాహంతో ప్రభుత్వ పథకాలను అమలుచేద్దాం

- జిల్లా కలెక్టర్ ప్రశాంతి
- నూతన సంవత్సర దినోత్సవ స్ఫూర్తిగా సమష్టిగా పనిచేయాలి
- న్యూఇయర్ వేడుకలు





కలెక్టర్ ప్రశాంతికి శుభాకాంక్షలు తెలుపుతున్న జేసీ చిన్నరాముడు, నగర మున్సిపల్ కమిషనర్ కేతన్‌గార్గ్

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): నూతన సంవత్సర వేళ ప్రభుత్వ ప్రాధాన్యత పథకాలను నూతనోత్సాహంతో సమర్థవంతంగా అమలుచేద్దామని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. బుధవారం కలెక్టర్ చాంబర్‌లో తనను కలిసి శుభాకాంక్షలు తెలిపిన అధికారులతో కలెక్టర్ మాట్లాడారు. ప్రభుత్వం ఎన్నో సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేయడం జరుగుతోందని, వాటిని విజయవంతంగా ప్రజలకు చేరవేయడంలో సమన్వయంతో పనిచేయాలని కోరారు. నూతన సంవత్సర దినోత్సవ స్ఫూర్తితో సమష్టిగా పనిచేయడం ద్వారా జిల్లాను అగ్రస్థానంలో నిలిపేలా అడుగులు వేద్దామన్నారు. కలెక్టర్‌కు జేసీ చిన్నరాముడు, నగర కమిషనర్ కేతన్‌గార్గ్, ఆర్డీవోలు ఆర్.కృష్ణనాయక్, రాణీ సుస్మిత తదితరులు శుభాకాంక్షలు తెలిపారు. మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ మృతి కారణంగా సంతాపదినాలు కావడంలో వేడుకలను ఈసారి నిరాడంబరంగా చేశారు.



ఫుల్‌గా తాగారు!

- జిల్లాలో రెండు డిపోల పరిధిలో రూ.23 కోట్లు
- గతంకంటే తగ్గిందనే వాదన
- డిసెంబరు నెలలో రూ.183 కోట్లు
- అయినా ముభావంగా వ్యాపారులు



(రాజమహేంద్రవరం - ఆంధ్రజ్యోతి)

పాత సంవత్సరానికి వీడ్కోలు.. కొత్త ఏడాదికి స్వాగతం పేరుతో తాగేవాళ్లు బాగానే తాగారు. డబ్బు లేనివాళ్లు తగ్గించారు... కొందరు సారాతోనూ, కల్లుతోనూ సరిపెట్టుకున్నారు. అయినా ప్రతీ ఏటా మాదిరిగా ఈ ఏడు కూడా మద్యం ఏరులైపారింది. కానీ గతంలో అంతంగా అమ్మకాలు లేవని మద్యం వ్యాపారులు చెప్పడం గమనార్హం. జిల్లాలో 125 మద్యం దుకాణాలు, 21 బార్లు ఉన్నాయి. రాజమహేంద్రవరం, చాగల్లు మండలం పరిధిలో ఎక్సైజ్ డిపోలు ఉన్నాయి. ఈ రెండు డిపోల పరిధి నుంచి డిసెంబర్ 30, 31 తేదీల్లో సుమారు రూ.23 కోట్ల మద్యం అమ్మకాలు జరిగాయి. డిసెంబరు నెల మొత్తం రూ.183 కోట్లు విక్రయాలు జరిగాయి. అయినా మద్యం వ్యాపారులు ముభావంగానే ఉన్నారు. సాధారణంగా ప్రతీ రోజూ జిల్లాలో జిల్లాలోని 125 మద్యం దుకాణాలు, 21 బార్ల ద్వారా సుమారు 8 నుంచి 9 కోట్ల వరకూ అమ్మకాలు ఉంటాయి. డిసెంబర్ 30, 31 తేదీల్లో పాత సంవత్సరం వెళ్లిపోతోందనే బాధతో గత అనుభవాలను నెమరవేసుకుంటూ, కొత్త సంత్సరానికి స్వాగతం పలుకుతూ డిసెంబర్ 31వ తేదీ తెల్లవారూ అనేకమంది ఎంజాయ్ చేస్తారు. ఇందులో మద్యం వినియోగమే ఎక్కువ. రాజమహేంద్రవరం వంటి నగరాల్లో పబ్‌లు, హోటళ్ల కిటకిటలాడాయి. తెల్లవారూ సందడే సందడి.. తాగేవాళ్లు తాగినంత తాగారు. న్యూ ఇయర్‌కి రాజమహేంద్రవరం డిపో నుంచి రూ. 12 కోట్ల సరుకు షాపులకు వచ్చింది. ఇది రాజమండ్రి డివిజన్‌లోని దుకాణాలతోపాటు ఏజెన్సీకి కొంత, అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని కొన్ని షాపులకు సరుకు వెళ్లింది. చాగల్లులోని మీనానగర్ డిపో నుంచి రూ.11 కోట్ల సరుకు షాపులకు వచ్చింది. పశ్చిమగోదావరి జిల్లాలోని కొన్ని షాపులకు కూడా వెళ్లింది. అందువల్ల ఈ సరుకు అంతా జిల్లాలోనే తాగినట్టు కాదని అధికారులు చెబుతున్నారు. కానీ బెల్ట్ షాపులు బాగా పెరగడం వల్ల ముందుగా కొనుగోలు చేసిన సరుకు కూడా అమ్మకాలు జరిగినట్టు ప్రచారం ఉంది. జిల్లాలో బెల్ట్ షాపులు బాగా పెరిగాయి. ఇక జిల్లాలో కొన్ని షాపుల్లో అమ్మకాలు జోరుగా సాగాయి. కొన్ని దుకాణాల్లో మాత్రం అమ్మకాలు డల్‌గా ఉన్నట్టు అధికారులు కూడా చెబుతున్నారు. రాజమహేంద్రవరం పరిధిలో ఏసీ గార్డెన్స్‌లోని దుకాణంలో మొదటినుంచి అమ్మకాలు బాగా జరుగుతున్నాయి. ఇక్కడ ఒకటే షాపు ఉంది. మండలం యూనిట్‌గా అనుమతి ఇవ్వడంతో ఎవరికి ఇష్టమైన చోట వాళ్లు దుకాణాలు పెట్టుకోవడంతో కూడా ఈ పరిస్థితి ఉన్నట్టు చెబుతున్నారు. లాలా చెరువులో ఏకంగా నాలుగు షాపులు దగ్గరలో పెట్టేయడం గమనార్హం. గతంలో వ్యాపారులంతా సిండికేట్ అయ్యేవారు. ఈసారి ఇంకా పూర్తిస్థాయిలో సిండికేట్ కాలేదని చెబుతున్నారు. పైగా ఈసారి రాజకీయ నేతలు కూడా ఈ వ్యాపారంలో ఉండడంతో కూడా సిండికేట్‌కు కొంత ఇబ్బందిగా ఉన్నట్టు కూడా ప్రచారం సాగుతోంది. ఈ పరిస్థితుల్లోనే కొందరు బాగా అమ్ముకుంటుంటే, కొందరు డల్‌గా ఉందని చెబుతున్నారు.

20 శాతం కమీషన్ బెంగ

మద్యం వ్యాపారుల్లో 20శాతం కమీషన్ రాకపోవడంతో బెంగ పెట్టుకున్నారు. సాధారణంగా బెంగ ఉన్నవాళ్లు లిక్కర్ తాగుతుంటారు. లిక్కర్ వ్యాపారులే బెంగ పెట్టుకుంటే ఇంకెవరికి చెప్పాలి. ప్రభుత్వం మొదట్లో 20 శాతం కమిషన్ ఇస్తానని హామీ ఇచ్చింది. కానీ ఇటీవల కేవలం 9నుంచి 10శాతం వరకే కమీషన్ ఇస్తున్నట్టు వ్యాపారులు చెబుతున్నారు. ప్రభుత్వం హామీ ఇచ్చిన మేరకు కమీషన్ ఇస్తే, ఈసారి అమ్మకాల్లో కూడా లాభాలు కనిపించేవి. వారు ఆనందంగా ఉండేవారు. కానీ ఇవాళ నూతన సంవత్సరానికి స్వాగతం, పాత సంవత్సరానికి వీడ్కోలు పేరిట గత నెల 30,31 తేదీల్లో సరుకుతోపాటు బుధవారం సుమారు రూ.8 కోట్ల వరకూ తాగినట్టు చెబుతున్నారు. అంటే ఈ మూడు రోజుల్లో సుమారు రూ.31 కోట్ల వరకూ అమ్ముడైనట్టు అంచనా. ఇందులో వ్యాపారులకు 20శాతం కమీషన్ ఉంటే ఆనందంగా ఉండేవారు. కానీ ఎక్కువ ఆదాయం రాష్ట్ర ప్రభుత్వానికి వెళ్లింది. వ్యాపారులు, ప్రభుత్వమూ ఎలా ఉన్నా మద్యం బాబులు మాత్రం ఏటా మాదిరిగా ఈ ఏడు కూడా ఫుల్‌గా తాగి, జేబులు, ఇల్లు, ఒళ్లు గుల్ల చేసుకున్నారు.



నిడదవోలులో బుధవారం ఆంగ్ల నూతన సంవత్సర వేడుకల్లో పాల్గొన్న మంత్రి కందుల దుర్గేష్

సరికొత్త ఆంధ్రప్రదేశ్‌ను నిర్మించుకుందాం : కందుల

నిడదవోలు, జనవరి 1(ఆంధ్రజ్యోతి): కొత్త సంవత్సరంలో రాష్ట్ర అభివృద్ధికోసం కలసికట్టుగా పనిచేసి సరికొత్త ఆంధ్రప్రదేశ్‌ను నిర్మించుకుందామని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక సినిమాటోగ్రఫీశాఖా మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. బుధవారం నిడదవోలు పట్టణంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో ఆంగ్ల నూతన సంవత్సర వేడుకలు జరిగాయి. ఈసందర్భంగా మంత్రి దుర్గేష్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి కట్టుబడి ఉందని, త్వరలోనే రాష్ట్రంలోని ప్రజలంతా సంక్షేమ అభివృద్ధి ఫలాలను చూస్తారన్నారు. మంత్రి దుర్గేష్‌ను వేద పండితులు వేద మంత్రోచ్ఛరణలతో ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, వైస్‌చైర్మన్ గంగుల వెంకటలక్ష్మి, కౌన్సిలర్లు కారింకి నాగేశ్వరరావు, చిలకల శారదాదేవి, ఎండీ షాకీరాబేగం, జనసేన నాయకులు మద్దిపాటి ఫణీంద్ర, రంగా రమేష్‌లు మంత్రికి శుభాకాంక్షలు తెలిపారు.

ఎస్సీ కులగణన పై సోషల్ ఆడిట్ పూర్తికి గడువు పొడిగింపు

రాజమహేంద్రవరంసిటీ, జనవరి1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఎస్సీల జనాభా గణనపై సోషల్ ఆడిట్ పూర్తి చేయడానికి గడువును పొడిగించినట్టు ఎస్సీ సంక్షేమ సాధికారత అధికారి ఎం.శోభారాణి తెలిపారు. బుధవారం సాయంత్రం ఒక ప్రకటన విడుదల చేశారు. గత నెల 26 నుంచి ఈనెల 7వ తేదీ వరకు గడువును పొడిగించారని, అభ్యంతరాలను ఈనెల 11వ తేదీ వరకు క్షేత్రస్థాయిలో పరిశీలిస్తారని తెలిపారు. సమగ్ర వివరాలు గ్రామ వార్డు సచివాలయాల్లో ప్రదర్శిస్తారని తెలిపారు. ఈ మేరకు జీవో జారీ అయ్యిందన్నారు.

జర్నలిస్టులకు అక్రిడేషన్ కార్డుల గడువు రెండు నెలలు పొడిగింపు : కలెక్టర్

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 1 (ఆంధ్రజ్యోతి):రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు జిల్లాలో 2024 డిసెంబరు 31తో ముగిసిన జర్నలిస్టుల అక్రిడేషన్ కార్డుల కాలపరిమితి జనవరి 1 నుంచి ఫిబ్రవరి 28వ తేదీ వరకు రెండు నెలలపాటు పొడిగిస్తున్నామని జిల్లా కలెక్టర్ పి ప్రశాంతి తెలిపారు. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ మేరకు బస్సు పాస్‌ల కోసం ఆర్టీసీకి లేఖ రాయడం జరిగిందని తెలిపారు. గురువారం నుంచి జిల్లా సమాచార పౌరసంబంధాల శాఖ కార్యాలయం నుంచి గడువు పొడిగింపు స్లిప్‌లు పంపిణీ చేస్తామని ఆ శాఖ అధికారి సీహెచ్ శ్రీనివాస్, డీపీఆర్వో ఐ కాశయ్య తెలిపారు.





సింహ వాహనంపై మలయప్పస్వామి అవతారంలో ఊరేగుతున్న శ్రీనివాసుడు.. పక్కన శ్రీదేవి, భూదేవి సమేత స్వామి వారు

సింహ వాహనంపై మాడవీధుల్లో ఊరేగిన శ్రీనివాసుడు

బిక్కవోలు, జనవరి1(ఆంధ్రజ్యోతి): తూర్పు తిరుమలగా పేరొందిన బలభద్రపురం శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వెంకటేశ్వరస్వామి ద్వితీయ బ్రహ్మోత్సవాలు బుధవారం తొమ్మిదవ రోజుకు చేరాయి. ఉదయం సుప్రభాత సేవతో కార్యక్రమాలు ప్రారంభించి సహస్ర కలశాభిషేకం, సుగంధ పుష్పాభిషేకం, మార్గ శీర్ష వ్రతం కార్యక్రమాలు జరిపారు. రాత్రి గోవింద నామ స్మరణల మధ్య సింహ వాహనంపై శ్రీమలయ్యప్పస్వామి అవతారంలో స్వామి అమ్మవార్లను మాడ వీధుల్లో ఊరేగించారు. స్వామి దర్శనానికి వచ్చిన భక్తులకు ఆలయ కమిటీ చైర్మన్ మల్లిడి గంగారెడ్డి అన్న ప్రసాదాన్ని ఏర్పాటుచేశారు. ఈ బ్రహ్మోత్సవాలకు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

వినోదంలో...విషాదం

నూతన సంవత్సరం వేళ
ఎన్టీఆర్ బీచ్‌లో బాధాకరమైన ఘటనలు
సముద్రంలోకి స్నానానికి దిగిన విద్యార్థుల మృతి
రెండు వేర్వేరు సంఘటనల్లో ఇద్దరు
ఇంటర్ విద్యార్థుల మరణం, మరొకరు గల్లంతు

సర్పవరం జంక్షన్ (కాకినాడ), జనవరి 1 (ఆంధ్రజ్యోతి): పర్యాటక విహార కేంద్రంగా ప్రసిద్ధి చెందిన కాకినాడ ఎన్టీఆర్ బీచ్ సందర్శకులకు ఆహ్లాదాన్ని పంచుతూనే... మరోవైపు ఆహ్లాదం మాటున ప్రమాదం పొంచి ఉన్న కడలి మృత్యు కెరటాలకు యువకులు బలవుతున్నారు. కొత్త సంవత్సరం వేళ స్నేహితులతో కలసి ఆనందోత్సాహాలతో బీచ్‌కు వచ్చిన యువకులు సముద్ర స్నానానికి దిగి కెరటాల ఉధృతికి గల్లంతైన 2 వేర్వేరు సంఘటనల్లో ఇద్దరు ఇంటర్ విద్యార్థులు మృతి చెందగా, మరొక యువకుడు గల్లంతైన సంఘటన ఎన్టీఆర్ ఓల్డ్ బీచ్‌లో బుధవారం సాయంత్రం జరిగాయి. వివరాల్లో కెళితే కొత్తపల్లి మండలం కోనపాపపేట శివారు మల్లివారితోటకు చెందిన గుత్తుర్తి సతీష్‌కుమార్ (17) కాకినాడ ఆదిత్య జూనియర్ కాలేజీలో హాస్టల్లో ఉంటూ ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యనభ్యసిస్తున్నాడు. కొత్త సంవత్సరం కావడంతో కాలేజీ నుంచి విహార యాత్ర (ఔటింగ్)కి వెళ్లేందుకు కాలేజీ అనుమతి ఇచ్చింది. దాంతో విద్యార్థులతో కలసి బుధవారం కాకినాడ రూరల్ మండలం సూర్యారావుపేట ఎన్టీఆర్ బీచ్‌కు వచ్చారు. అక్కడ కాసేపు ఆనందంగా గడిపిన తర్వాత ఓల్డ్ ఎన్టీఆర్ బీచ్‌లో సముద్ర స్నానాలు చేసేందుకు దిగారు. సముద్ర కెరటాల ఉధృతికి సతీష్‌కుమార్ గల్లంతయ్యాడు. అనంతరం మృతదేహం ఒడ్డుకు కొట్టుకు వచ్చింది.


ఎన్టీఆర్ బీచ్‌లో మృతిచెందిన పీఆర్ కాలేజ్ విద్యార్థి నాగసాయి

మరో సంఘటనలో...కాకినాడ రామకృష్ణారావు పేట ఎర్రరోడ్డుకు చెందిన వడిసెల గౌరీ లక్ష్మీ నాగసాయి (16), బొర్ర శ్రీనుబాబు మరో ముగ్గురు మొత్తం ఐదుగురు స్నేహితులతో కలసి సూర్యారావుపేట బీచ్‌కు వచ్చారు. అక్కడ కాసేపు ఆనందంగా గడిపిన తర్వాత సముద్రంలో స్నానానికి దిగారు. లక్ష్మీనాగసాయి, బొర్రా శ్రీనుబాబులు కెరటాల్లో పడగా లక్ష్మీనాగసాయి మృతిచెందాడు. మృతుడు కాకినాడ పీఆర్ కాలేజీలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. శ్రీనుబాబు సముద్రంలో గల్లంతయ్యాడు. ఈ విషయాన్ని స్నేహితులు వారి కుటుంబ సభ్యులు, పోలీసులకు సమాచారం అందించగా తిమ్మాపురం ఎస్ఐ ఎంవీవీ రవీంద్ర బాబు సిబ్బందితో కలసి సంఘటనా స్థలానికి చేరుకుని రెండు మృతదేహాలను పోస్టుమార్టమ్ కోసం కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు. గల్లంతైన యువకుడి కోసం మత్స్యకారులతో గాలింపు చేపట్టినట్టు ఎస్ఐ తెలిపారు. రెండు వేర్వేరు ఘటనల్లో ఇద్దరు విద్యార్థులు మృతిచెందగా, ఒకరు గల్లంతయ్యారన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు. తమ కుమారుడు ఔటింగ్‌కి వెళ్లినట్లు కాలేజీ సిబ్బంది ఉదయం ఫోన్ చేసి చెప్పారని, తర్వాత సాయంత్రం 4.30 గంటలకు చనిపోయినట్లు సమాచారం చెప్పారని సతీష్‌కుమార్ తండ్రి లక్ష్మీనారాయణ కన్నీరుమున్నీరుగా విలపించాడు. తన సమ్మతి తీసుకోకుండానే ఔటింగ్‌కు పంపించారని ఆరోపించారు. తమకు సమాచారం ఇవ్వకుండా కుమారుడు మృతదేహాన్ని మార్చురీకి తరలించినందుకు వ్యతిరేకంగా కాలేజీ వద్ద కుటుంబ సభ్యులతో ధర్నా నిర్వహించారు. ఈ విషయమై తమకు న్యాయం చేయాలని ఆందోళన చేశారు.


మరణించిన సతీష్‌కుమార్ (ఫైల్)


గల్లంతు అయిన శ్రీనుబాబు (ఫైల్)

వేటకు వెళ్లి మత్స్యకారుడి గల్లంతు

పి.గన్నవరం, జనవరి 1(ఆంధ్రజ్యోతి): వేటకు వెళ్లి గోదావరిలో మత్స్యకారుడు గల్లంతైన విషాధఘటన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పి.గన్నవరం మండలం వై.కొత్తపల్లి లో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. వై.కొత్తపల్లికి చెందిన శేరు వీరకనక రాజు(40) అదే గ్రామానికి చెందిన మరో 15మందితో కలిసి కె.ఏనుగుపల్లి గోదావరిలోకి కొయ్యింగల పైలు వేటకు వెళ్లాడు. ఈ క్రమంలో గోదావరిలో వల మోడుకు చిక్కిపడడంతో తీసే క్రమంలో ప్రమాదవశాత్తు వీరకనకరాజు నీటిలో గల్లంతయ్యాడు. దీంతో తోటి మత్స్యకారులు ప్రయత్నించిన ఫలితం లేకుండా పోయింది. వీరకనకరాజు ఆచూకీ కోసం మత్స్యకారులు వలలు సాయంతో గాలింపు చర్యలు చేపట్టారు. అతడికి భార్య వెంకటరమణ, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. భర్త గోదావరిలో గల్లంతు కావడంతో భార్యతో పాటు కుమారులు గోదావరి ఒడ్డున రోదిస్తున్న తీరు చూపరులను కంటతడి పెట్టించింది. ప్రమాద సమచారాన్ని స్థానికులు, కుటుంబ సభ్యులు రెవెన్యూ, పోలీసు అధికారులకు తెలియజేశారు.


కె.ఏనుగుపల్లిలో రోదిస్తున్న వీరకనకరాజు భార్య, కుమారులు


వీరకనకరాజు (ఫైల్)

భర్త పెట్టే హింసలు భరించలేక..

నూతన సంవత్సరం రోజున వివాహిత ఆత్మహత్య

గోకవరం, జనవరి 1(ఆంధ్రజ్యోతి): నూతన సంవత్సరం రోజున వివాహిత ఆత్మహత్య చేసుకున్న సంఘటనపై బుధవారం గోకవరం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఎస్ఐ పవన్‌కుమార్ కథనం ప్రకారం.. పోలీస్ స్టేషన్ వెనుక వీధికి చెందిన షేక్ మీరా సాహెబ్, గండేపల్లి అనూష(24) సుమారు 8ఏళ్ల క్రితం ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. వారికి ఇద్దరు పిల్లలు సంతానం. గత కొద్దిరోజులుగా అనుమానంతో మీరాసాహెబ్ అనూషను వేధింపులకు గురి చేస్తున్నాడు. ఈ క్రమంలో భర్త పెట్టే హింసలు భరించలేక అనూష బుధవారం ఇంట్లో చీరతో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలు తండ్రి వీరబాబు ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్టు, మీరా సాహెబ్ పరారీలో ఉన్నట్టు ఎస్ఐ చెప్పారు.


అనూష (ఫైల్)

హత్యా లేక ఆత్మహత్యా?

జార్జిపేటలో వ్యక్తి అనుమానాస్పద మృతి

తాళ్లరేవు, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా తాళ్లరేవు మండలం జార్జిపేట గ్రామంలో కుడిపూడి మల్లికార్జునరావు (45) ఇంటి పిల్లరు ఊసలకు ఉరివేసుకుని మరణించడం ఆ ప్రాంతంలో సంచలనమైంది. వ్యాపార, ఆర్థిక లావాదేవీల నేపథ్యంలో ఇది హత్యా లేక ఆత్మహత్యా అని స్థానికులు అనుమానాలను వ్యక్తం చేస్తున్నారు. కోరింగ పోలీసుల వివరాల ప్రకారం.. జార్జీపేటలో కాకర్లపల్లి శ్రీనివాసరావు, నీలపల్లి గ్రామానికి చెందిన కుడిపూడి మల్లికార్జునరావు వాయిదా సామన్లు, సీట్లు ఫైనాన్స్ వ్యాపారం గత కొన్నేళ్లగా ఉమ్మడిగా చేస్తున్నారు. ఈ నేపథ్యంలో మల్లికార్జునరావుకు శ్రీనివాసరావు కొంతడబ్బు బకాయిపడ్డాడు. బకాయి డబ్బులు అడుగుతుంటే సరిగ్గా సమాధానం చెప్పకుండా దాటవేస్తూ తప్పించుకుంటూ తిరగడంతో ఇద్దరి మధ్య మనస్పర్థలు ఏర్పడ్డాయి. దీంతో మంగళవారం రాత్రి మల్లికార్జునరావు శ్రీనివాసరావు డాబా ఇళ్లపిల్లరు ఊసలకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. విషయం తెలుసుకున్న కోరింగ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలను సేకరించారు. శ్రీనివాసరావు పరారీలో ఉన్నాడు. మల్లికార్జునరావు మంగళవారం సాయంత్రం 6 గంటలకు కూరగాయలు తీసుకొచ్చి ఇచ్చేసి ఇంటి బయటకు వెళ్లాడని, ఎంతకీ రాకపోవడంతో రాత్రి 8గంటలకు ఫోన్‌చేయగా వచ్చేందుకు ఆలస్యం అవుతుందని అన్నాడని అతడి భార్య నాగదుర్గ చెప్పింది. నా భర్తను హత్య చేశారని ఆరోపించింది. కోరింగ ఎస్ఐ పి.సత్యనారాయణ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కాకినాడ ప్రభుత్వాసుపత్రికి అంబులెన్స్‌లో తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


ఉరి వేసుకున్న మల్లికార్జునరావు

ఇద్దరిని తీవ్రంగా గాయపర్చి... మహిళల పట్ల అమానుషంగా ప్రవర్తించి..

రాత్రి పూట బీభత్సం చేసిన ఏడుగురు
కేసు నమోదు చేసిన పోలీసులు

సీతానగరం, జనవరి 1(ఆంధ్రజ్యోతి): రాజంపేటలో దాడికి పాల్పడి ఇద్దరిని తీవ్రంగా గాయపర్చడమే కాకుండా మహిళల పట్ల అమానుషంగా ప్రవర్తించిన ఏడుగురిపై కేసు నమోదు చేసినట్టు సీతానగరం ఎస్ఐ డి.రామ్ కుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. తూర్పుగోదావరి జిల్లా సీతానగరం మండలం రాజంపేట బీసీ కాలనీలో డిసెంబర్ 31 రాత్రి ద్విచక్రవాహనంపై గుడ దుర్గాప్రసాద్ మరో వ్యక్తితో కలిసి వచ్చి నూతన సంవత్సర ముగ్గులు పెడుతున్న మహిళల వద్దకు వచ్చి బండి ఎక్సలేటర్ శబ్దం చేస్తూ మహిళలను కామెంట్ చేశాడు. అక్కడ ఉన్న దాసరి రాము అతడి బావమరిది మహిళలతో ఇలా ప్రవర్తించడం తప్పని వారించడంతో ఆగ్రహానికి గురైన గాడ దుర్గాప్రసాద్ ఫోన్ చేసి తన మిత్రులను పిలిచాడు. వారు వచ్చి చంపేస్తామని బెదిరిస్తూ రాళ్లు, కర్రలతో దాడి చేశారు. మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించి వారిపై చేతులు వేసి తాకకూడని చోట తాకి ఇబ్బంది కలిగిస్తూ బీభత్సం చేశారు. వారు చేసినదాడిలో దాసరి రాముతో పాటు అతడి బావమరిది అప్పలరాజు తీవ్రంగా గాయపడగా రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ నుంచి వచ్చిన సమాచారం మేరకు దాడికి పాల్పడిన గాడ దుర్గాప్రసాద్‌తో పాటు గాడ వెంకటేష్, సిద్ధు, హర్ష, జయసూర్య, వినయ్, మనోజ్, మరికొంతమందిపై హత్యాయత్నం కేసు నమోదు చేశామని ఎస్ఐ పేర్కొన్నారు.

ముక్క ఊడేలా భార్య బుగ్గను కొరికి...

పైశాచికత్వం ప్రదర్శించిన భర్త

గొల్లప్రోలు రూరల్, జనవరి 1(ఆంధ్రజ్యోతి): ముక్క ఊడేలా భార్య బుగ్గను కొరికి భర్త పైశాచికత్వం ప్రదర్శించిన సంఘటన కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం తాటిపర్తిలో జరిగింది. గ్రామానికి చెందిన దాసం నాగబాబు, శేషారత్నంకు వివాహమై నాలుగేళ్లు అయింది. వారికి పిల్లలు లేరు. ఈ నేపథ్యంలో ఇద్దరి మధ్య కొంతకాలంగా వివాదం జరుగుతోంది. ఈ విషయంపై నాగబాబు తన భార్యను మానసికంగా, శారీరకంగా హింసిస్తూ ఉండేవాడు. అంతేకాకుండా వేరే మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడు. ఈ విషయంపై మంగళవారం రాత్రి భార్యభర్తల మధ్య మరోమారు వాగ్వివాదం జరిగింది. దీంతో నాగబాబు తన భార్య శేషారత్నం మెడను కొరికి చంపాలని ప్రయత్నించాడు. సాధ్యం కాకపోవడంతో బుగ్గను మాంసం ముద్ద వచ్చేలా కొరికి దానిని ఊసివేశాడు. విషయం తెలుసుకున్న నాగమణి సోదరులు వచ్చి ఆమెను పిఠాపురం ప్రభుత్వాసుపత్రికి తరలించగా అక్కడ వైద్యులు చికిత్స చేశారు. నాగమణి ఫిర్యాదుపై గొల్లప్రోలు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పిల్ల కాలువలోకి సిమెంట్ లారీ బోల్తా

తప్పిన ప్రమాదం

తుని రూరల్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా తుని మండలం తేటగుంట సమీపంలో సిమెంట్ లారీ బోల్తా పడింది. విజయవాడ నుంచి ఒడిశాకు సిమెంట్ లోడుతో బయలుదేరిన ఓ లారీ తేటగుంటకు చేరుకునేసరికి రోడ్డుపక్కనే నిలిపివేసి ఉన్న ఒక వాహనం ఒకసారిగా రోడ్డుపైకి రావడంతో వెనకనుంచి వస్తున్న సిమెంట్ లారీ అదుపు తప్పి పక్కనే ఉన్న పిల్ల కాలువలో బోల్తా పడింది. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదమే తప్పిందని స్థానికులు తెలిపారు. తేటగుంట సెంటర్లో హోటల్ నిర్వాహకులు నిర్లక్ష్య ధోరణి కారణంగా వాహనదారులు అడ్డదిడ్డంగా నిలిపివేయడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని, వీటి కట్టడికి పోలీసులు చొరవ తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.


తేటగుంట వద్ద అదుపు తప్పి బోల్తా పడిన సిమ్మెంటు లారీ

ఆలయాలకు 'నూతన' శోభ

సత్యదేవునికి ప్రముఖుల పూజలు


దర్శనానంతరం ప్రవచనకర్త చాగంటి కోటేశ్వరరావు దంపతులు


అన్నవరం, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): కాకి నాడ జిల్లాలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుడి సన్నిధిలో బుధవారం నూతన ఆంగ్ల సంవత్సరం పురస్కరించుకుని పలువురు ప్రముఖులు పూజలు నిర్వహించారు. ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచనకర్త చాగంటి కోటేశ్వరరావు దంపతులు స్వామిని దర్శించుకున్నారు. జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ దంపతులు స్వామివారి వ్రతమాచరించారు. మాజీ మంత్రి, ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ దంపతులు స్వామివారి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారికి ఆలయ ఈవో వీర్ల సుబ్బారావు ఆలయ మర్యాదలతో ఘనస్వాగతం పలికారు. స్వామి దర్శనానంతరం వేదపండితులు వేదాశీర్వచనాలు అందజేశారు. మరోపక్క పలు ప్రాంతాల నుంచి స్వామి దర్శనానికి భక్తులు విచ్చేశారు. ప్రత్యేక దర్శనానికి 2 గంటలు, ఉచిత దర్శనానికి 3 గంటల సమయం భక్తులు వేచి ఉన్నారు. సుమారు 40 వేలమంది స్వామిని దర్శించుకున్నారు.


ఆలయంలో ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ

వాడపల్లికి పోటెత్తిన భక్తజనం

రూ.5.87లక్షల ఆదాయం

ఆత్రేయపురం, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయం నూతన సంవత్సర వేళ భక్తజనంతో కిటకిటలాడింది. బుధవారం వేకువజామునే స్వామివారికి గోదావరి జలాలతో అభిషేకం, తిరుప్పావై సేవా కాలం నిర్వహించి భక్తులకు దర్శనాలకు అనుమతించారు. నూతన సంవత్సరానికి స్వాగతం చెబుతూ ఫలపుష్పాలతో అలంకరణ భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. స్వామివార్ల ఫోటోలను ఏర్పాటు చేసిన ఫోటోషూట్ వద్ద భక్తుల సందడి కనిపించింది. అశేష భక్తజనం స్వామివారిని దర్శించుకుని అన్నప్రసాదం స్వీకరించారు. ఏడువారాల నోము ఆచరించిన భక్తులు స్వామివారికి అష్టోత్తర పూజలు నిర్వహించుకుని మొక్కులు తీర్చుకున్నారు. వివిధ సేవల ద్వారా రూ.5,87,238 ఆదాయం లభించినట్టు ఉపకమిషనరు, ఈవో నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు.





వాడపల్లి వెంకన్న ఆలయంలో పోటెత్తిన భక్తజనం, ఫలపుష్పాలతో అలంకరణ దృశ్యాలు

పాదగయకు భక్తుల తాకిడి


పాదగయలో అభిషేకం నిర్వహిస్తున్న అర్చకుడు

పిఠాపురం, జనవరి 1(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురంలో పాదగయ క్షేత్రానికి బుధవారం భక్తుల తాకిడి అధికంగా ఉంది. పాదగయలోని కుక్కుటేశ్వరస్వామి, దత్తాత్రేయస్వామి, రాజరాజేశ్వరీదేవి, పురుహూతికాఅమ్మవార్లను దర్శించుకుని పూజలు చేశారు. దర్శనాలకు భక్తులు బారులు తీరారు. తిరుమల తిరుపతి దేవస్థానం నిర్వహణలోని వేంకటేశ్వరస్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. దేశంలోని పంచమాధవ క్షేత్రాల్లో ఒకటిగా విరాజిల్లుతున్న కుంతీమాధవస్వామి దేవస్థానంలో భక్తులు పూజలు చేశారు.

సిద్ధి వినాయకుని ఆదాయం రూ.4.49 లక్షలు

అయినవిల్లి, జనవరి 1(ఆంధ్రజ్యోతి): అయినవిల్లి శ్రీసిద్ధివినాయకుడికి బుధవారం రూ.4,49,861 ఆదాయం వచ్చింది. అన్నప్రసాద విరాళం రూ.1,76,111. విరాళం 11,647తో మొత్తం ఆదాయం రూ.4,49,861 వచ్చినట్టు సహాయ కమిషనర్ ముదునూరి సత్యనారాయణరాజు తెలిపారు.

రత్నాచల్ ఎక్స్‌ప్రెస్ రాకపోకలలో మార్పులు

సామర్లకోట, జనవరి 1 (ఆంధ్ర జ్యోతి): విజయవాడ రైల్వే డివిజన్ పరిధిలో వివిధ ప్రాంతాలకు రాకపోకలు సాగించే పలు ఎక్స్‌ప్రెస్ రైళ్ల సమయాలను మార్పులు చేస్తూ రైల్వే ఉన్నతాధికారులు చర్యలు తీసుకున్నారు. బుధవారం సామర్లకోట రైల్వే స్టేషన్ ఉన్నతాధికారులకు అందిన సమాచారాన్ని ఆంధ్రజ్యోతి బుధవారం రాత్రి సేకరించింది. బుధవారం నుంచే అమలులోకి తెచ్చిన ఈ సమయాలు ఇలా ఉన్నాయి. రోజూ ఉదయం 6.15 గంటలకు విజయవాడ నుంచి విశాఖకు బయలుదేరే రత్నాచల్ ఎక్స్‌ప్రెస్ బుధవారం నుంచి ఉదయం 6.00 గంటలకే బయలుదేరుతుంది. అంటే 15 నిముషాల ముందు బయలుదేరుతుంది. సామర్లకోటకు నిత్యం విజయవాడ నుంచి విశాఖకు అధికసంఖ్యలో ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్నందున మారిన సమయాలను ప్రయాణికులు గుర్తించుకోవాలనితెలి పారు.

కుంభమేళాకు ప్రత్యేక రైళ్లు

కుంభమేళాకు ప్రయాణించే రైలు ప్రయాణికుల సౌకర్యార్థం విజయవాడ, సామర్లకోటల మీదుగా పలు ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైళ్లను నడుపుతున్నట్టు రైల్వే పీఆర్వో కార్యాలయం నుంచి బుధవారం ఉత్తర్వులు అందాయి. 07107 నంబరు గల ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైలు తిరుపతి నుంచి బెనారస్‌కు ప్రత్యేక రైలు జనవరి 18, ఫిబ్రవరి 8,15,23 తేదీల్లో శనివారం రాత్రి 8.55 గంటలకు తిరుపతిలో బయలుదేరుతుంది. బెనారస్‌కు సోమవారం మధ్యాహ్నానికి అంటే 3.45 గంటలకు చేరుతుంది.

07108 నంబరు గల బెనారస్-తిరుపతి మధ్య తిరుగు ప్రయాణంలో జనవరి 20, ఫిబ్రవరి 10,17,24 తేదీల్లో బెనారస్‌లో మంగళవారం సాయంత్రం 5.30గంటలకు బయలుదేరుతుంది.

ఈ రైళ్లకు రాష్ట్రంలో గూడూరు, నెల్లూరు, ఒంగోలు, చీరాల, తెనాలి, విజయవాడ, ఏలూరు, తాడేపల్లిగూడెం, నిడదవోలు, రాజమహేంద్రవరం, సామర్లకోట, అన్నవరం, యలమంచిలి, అనకాపల్లి, దువ్వాడ, పెందుర్తి, కొత్తవలస, విజయనగరం, బొబ్బిలి, పార్వతీపురం, రాయగడ, మునిగుడలలో హాల్ట్ ఉంది.

అదుపుతప్పి పొలాల్లోకి దూసుకుపోయిన ఆటోలు

తప్పిన ప్రమాదం
ఐదుగురికి స్వల్పగాయాలు

శంఖవరం, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా శంఖవరం మండలంలోని గిరిజన గ్రామం శృంగధారలో బుధవారం రాత్రి జరిగిన ప్రమాదంలో ఐదుగురికి స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం బుధవారం రాత్రి పెదమల్లాపురం సమీపంలో శృంగధార వద్ద ఎదురెదురుగా వస్తున్న ఆటోలు అదుపుతప్పి పొలాల్లోకి దూసుకుపోయాయి. ఎటువంటి ప్రాణపాయం లేకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. గాయపడినవారిని ప్రయివేటు ఆసుపత్రికి తరలించారు. దీనిపై అన్నవరం పోలీస్ స్టేషనులో ఏ కేసు నమోదు కాలేదు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

పిఠాపురం, జనవరి 1(ఆంధ్రజ్యోతి): పిఠాపురంలోని రాజారామ్మోహనరాయ్ పార్కులో గుర్తు తెలియని వ్యక్తి మరణించాడు. కొంతకాలంగా అక్కడే ఉంటున్న అతడు మంగళవారం సాయంత్రం మరణించగా స్థానికులు పోలీసులు, మున్సిపల్ అధికారులకు సమాచారం ఇచ్చారు. బుధవారం సాయంత్రం మృతదేహం అక్కడే ఉండడంతో పార్కుకు వచ్చిన వారు ఇబ్బందులు పడ్డారు. కుటుంబ సభ్యుల సమాచారం తెలియకపోవడంతో ఎట్టకేలకు మున్సిపల్ సిబ్బంది వచ్చి మృతదేహాన్ని అంతిమ సంస్కారాలకు తరలించారు.


పార్కులో మరణించిన వ్యక్తి


నన్నయ విశ్వవిద్యాలయం క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న వీసీ శ్రీనివాసరావు

'నన్నయ' అభివృద్ధికి సహకరించాలి

వీసీ శ్రీనివాసరావు

దివాన్‌చెరువు, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): ప్రతీ ఒక్కరూ తమ పనిని త్రికరణశుద్ధిగా నిర్వహిస్తూ విశ్వవిద్యాలయ అభివృద్ధికి సహకరించాలని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య వై.శ్రీనివాసరావు అన్నారు. విశ్వవిద్యాలయం 2025 క్యాలెండర్‌ను బుధవారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నూతన సంవత్సరంలో నన్నయ విశ్వవిద్యాలయ ప్రాంగణాలు, అనుబంధ కళాశాలల సిబ్బంది, విద్యార్థులంతా నూతన లక్ష్యాలను ఎంచుకుని సాకారం చేసేందుకు కృషి చేయాలన్నారు. కొత్త సంవత్సరంలో విద్య, ఉద్యోగాల్లో ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం విశ్వవిద్యాలయంలోని అన్ని విభాగాలను వీసీ సందర్శించి అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బందికి శుభాకాంక్షలు తెలిపారు. రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, విశ్వవిద్యాలయ అధికారులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో దేవగుప్తం సొసైటీ సీఈవో మృతి

అల్లవరం, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): తాడికోన ఆక్వా చెరువుల వద్ద మంగళవారం రాత్రి విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద విద్యుత్ షాక్‌తో దేవగుప్తం సహకార సొసైటీ సీఈవో కొల్లా దుర్గాప్రసాద్‌స్వామినాయుడు(40)మృతిచెందారు. ట్రాన్స్‌ఫార్మర్ వద్ద నాయుడు మృతదేహాన్ని కనుగొని అమలాపురంలోని ఏరియా ఆసుపత్రికి తరలించారు. అయితే అతను అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. స్వామినాయుడుకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. స్వామినాయుడు మృతికి సంతాపంగా మండలంలోని 8 సహకార సంఘ కార్యాలయాలు మూసివేసి సంతాపం ప్రకటించారు. దేవగుప్తం సహకార సొసైటీ అధ్యక్షుడు జిన్నూరి రామారావు, డీసీసీబీ అల్లవరం బ్రాంచి బీఎం ప్రియదర్శిని, సీఈవో కొమ్మూరి సత్తిబాబు స్వామినాయుడు మృతి పట్ల ప్రగాఢ సంతాపం తెలిపారు. రొయ్యల చెరువు వద్ద విద్యుత్ కనెక్షన్ ఇస్తుండగా కొల్లా దుర్గాప్రసాద్ స్వామినాయుడు మృతి చెందాడని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ జి.హరీష్‌కుమార్ తెలిపారు.


స్వామినాయుడు (ఫైల్)

రాజమహేంద్రవరం
• రాజమహేంద్రవరం సిటీ/ రూరల్ • రాజానగరం • అనపర్తి
ఆంధ్రజ్యోతి www.andhrajyothy.com

జవహర్ వాకర్స్ క్లబ్
నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం



వాకర్స్ క్లబ్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం చేస్తున్న దృశ్యం

రాజమహేంద్రవరం కల్చరల్ జనవరి 1(ఆంధ్రజ్యోతి): స్థానిక వెంకటేశ్వరనగర్‌లో గల జవహర్ వాకర్స్ క్లబ్ నూతన కమిటీ బుధవారం ప్రమాణ స్వీకారం చేశారు. అధ్యక్షుడిగా ఉండవల్లి సత్యనారాయణ, సెక్రటరీగా సూర్యనారాయణమూర్తి, కోశాధికారిగా నాగేశ్వరరావు, ఉపాధ్యక్షుడిగా టి.లక్ష్మీనారాయణ, గంధం వాసు, రాఘవరెడ్డి, సుబ్బారావు, సురేష్‌బాబు, ట్రస్టిబోర్డు ఛైర్మన్‌గా కీర్తి సుబ్బారావు, సభ్యులుగా మాస్టర్ రాజు, వెలుమూరు మూర్తి, సలహాదారు కమిటీ ఛైర్మన్‌గా బాలం సత్యనారాయణ ఇతర సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ ఎన్నికల కార్యక్రమం, వాకర్స్ ఇంటర్నేషనల్ జిల్లా 103 గవర్నర్ సప్పా నాగేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమంలో జవహర్ వాకర్స్ క్లబ్ వారికి, జిల్లాస్థాయిలో వచ్చిన బెస్ట్ క్లబ్ అవార్డు, రాష్ట్రస్థాయిలో వచ్చిన బెస్ట్ క్లబ్ అవార్డు, 10వేల రూపాయల క్యాష్ అవార్డు వచ్చినందుకు, సభ్యులు క్లబ్ పాలకవర్గ సభ్యులకు అభినందనలు తెలిపారు.

సంపూర్ణ ఆరోగ్యమే కూటమి ధ్యేయం

● సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీలో ఎమ్మెల్యే శ్రీనివాస్


చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే వాసు

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 1(ఆంధ్రజ్యోతి): ప్రజలందరి సంపూర్ణ ఆరోగ్యమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని రాజమహేంద్రవరం ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. బుధవారం రాజమహేంద్రవరం తిలక్‌రోడ్డులోని తన కార్యాలయంలో వివిధ అనారోగ్య సమస్యలతో సీఎం సహాయ నిధికోసం ఎదురుచూస్తున్న ముగ్గురికి ఎమ్మెల్యే ఆదిరెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని సీఎంఆర్ఎఫ్‌ను మంజూరు చేయించారు. బుధవారం ఆ ముగ్గురికి రూ.2లక్షల 40వేలు చెక్కులను ఆదిరెడ్డి వాసు అందించారు. రాజమహేంద్రవరం సిటీ నియోజకవర్గంలో ఇప్పటి వరకు సుమారు 70 లక్షలు సీఎంఆర్ఎఫ్ నుంచి లబ్ధిదారులకు అందజేసినట్లు తెలిపారు. రాజమహేంద్రవరానికి సంబంధించి ఇంకా సుమారు 80లక్షలు పెండింగ్‌లో ఉన్నాయని వాటిని కూడా అతి త్వరలో అందజేస్తామని అన్నారు. రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రిని ప్రజలకు పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకువచ్చామని చెప్పారు.

దేవాంగ సంఘీయుల ఆత్మీయ సమావేశం

రాజమహేంద్రవరం కల్చరల్ జనవరి1(ఆంధ్రజ్యోతి): స్థానిక జాంపేట ఉమారామలింగేశ్వర కల్యాణ మండపంలో బుధవారం, రొబ్బి విజయశేఖర్ అధ్యక్షతన దేవాంగ సంఘీయుల ఆత్మీయ సమావేశం జరిగింది. రొబ్బి విజయశేఖర్ మాట్లాడుతూ, దేవాంగులు అన్ని రంగాలలో ముందుకు వెళ్లాలని ఆకాంక్షించారు. అందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ప్రధాన కార్యదర్శి కాలెపు సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ దేవాంగులు, తమ తమ పిల్లలను విద్యావంతులుగా తీర్చిదిద్దాలని హితవు పలికారు. కార్యక్రమంలో గంపా సోమలింగేశ్వరరావు, కెకె సంజీవరావు, బళ్ళా శ్రీనివాసరావు, పూర్ణిమ ప్రసాద్, అల్లక సాంబ, మామూరి బాబూరావు, అల్లంకి మణికంఠ, దేవాంగ సంఘీయులు హాజరయ్యారు.


దేవాంగ సంఘీయుల ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న వక్తలు

పురోహితులకు రగ్గులు పంపిణీ

పురోహితులకు రగ్గులు పంపిణీ

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 1(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరంలో ఆంధ్రజ్యోతితోపాటు మరొక ప్రధానపత్రికలో చలి తీవ్రతపై వచ్చిన కథనాలకు స్పందించి ఎస్‌వీసీ ట్రస్ట్ ఆధ్వర్యంలో స్థానిక మార్కండేయస్వామి ఆలయంలో వంద మంది వేదపండితులకు రగ్గులు అందించారు. ఈ సేవలు రాజమహేంద్రవరంలో కొనసాగిస్తున్నట్లు బుధవారం శ్రీరాజ్ తెలిపారు.

కోటి ఆశలతో కొత్త ఏడాదిలోకి అడుగులు

● రాజమహేంద్రవరం ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ ● ఘనంగా నూతన సంవత్సర వేడుకలు


ఆదిరెడ్డి శ్రీనివాస్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న మహిళలు

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 1(ఆంధ్రజ్యోతి): కోటి ఆశలతో నూతన సంవత్సరంలోకి అడుగుపెట్టామని రాజమహేంద్రవరం ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. తిలక్‌రోడ్డులోని ఎమ్మెల్యే నివాసం, పార్టీ కార్యాలయం ప్రాంగణమంతా బుధవారం టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, మాజీ కార్పొరేటర్లు, వివిధ కమిటీల ఛైర్మన్లు,అధికారులు, పోలీస్ అధికారులు, తెలుగు మహిళలతో కిక్కిరిసిం ది. ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, ఆయన సతీమణి మాజీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి భవాని, మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు, తొలి మహిళా మేయర్ ఆదిరెడ్డి వీరరాఘవమ్మ కుటుంబమంతా ప్రజల్లోకి వచ్చి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు మాట్లాడుతూ 2024 ఏడాదిలో దుష్టపాలనను అంతం చేసి కూటమి ప్రభుత్వాన్ని ప్రజలు అధికారంలోకి తీసుకువచ్చారని 2025లో ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని ప్రభుత్వ సంక్షే మం, అభివృద్ధితో రాష్ట్రం ప్రగతి పథంలో పయనించాలని సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, రాష్ట్ర విద్యాశాఖ మంత్రి లోకేష్‌లు కృషిచేస్తున్నారని తప్పక ప్రజలకు మంచి జరుగుతుందన్నారు. వేడుకల్లో చాంబర్ ఆఫ్ కామర్స్ సభ్యులు, ఆర్యాపురం బ్యాంక్ పాలకవర్గం, సిబ్బంది, రూడా సిబ్బంది, నగరపాలక సంస్థ సిబ్బంది, టింబర్ అసోసియేషన్, ఆటో కన్సల్టెన్సీ, రేషన్‌డీలర్స్ అసోసియేషన్, తోపుడుబండ్ల వర్తక సంఘం నాయకులు పాల్గొని ఎమ్మెల్యేను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. జనసేన నగర ఇన్‌చార్జి అనుశ్రీ సత్యనారాయణ కార్యాలయంలో న్యూఇయర్ వేడుకలు జరిగాయి.

● రాజమహేంద్రవరం శ్రీరామ్‌నగర్‌లోని టీడీపీ సీనియర్ నేత గన్నికృష్ణ నివాసంలో న్యూఇయర్ వేడుకలు ఘనంగా జరిగాయి. బుధవారం ఉదయం టీడీపీ నాయకులు, కార్యకర్తలు, జనసేన, బీజేపీ నాయకులు, అధికారులు గన్నికృష్ణను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. నూతన సంవత్సరంలో అందరు బాగుండాలని గన్నికృష్ణ ఆకాంక్షించారు.

● లాలాచెరువు స్వర్ణాంధ్ర వృద్ధాశ్రమంలో న్యూఇయర్ వేడుకలను నిర్వాహకులు డాక్టర్ గుబ్బల రాంబాబు నిర్వహించారు. ఈసందర్భంగా వృద్ధులకు దుస్తులను, కాస్మోటిక్స్‌ను అందించారు. కార్యక్రమంలో హెల్పింగ్ హ్యాండ్స్ అడ్మిన్ అనూప్ కుమార్ జైన్, బాలాజీ, ప్రసాద్, హరికృష్ణ, మీరా కుమారి, ధనలక్ష్మి, హరిప్రసాద్, కొండలరావు, అలివేలు తదితరులు పాల్గొన్నారు.

● రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల నివాసంలో..

రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి నివాసంలో న్యూ ఇయర్ వేడుకలు ఘనంగా జరిగాయి. రూరల్ నియోజకవర్గం నుంచి పెద్దఎత్తున టీడీపీ నాయకులు, కార్యకర్తలు గోరంట్లను కలిసి పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. రూరల్ మండల ప్రభుత్వ కార్యాలయాల అధికారులు, పోలీసులు, రెవెన్యూ ఉద్యోగులు, ఇరిగేషన్ సిబ్బంది. టీడీపీ నాయకులు, కార్యకర్తలు, బీజేపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు గోరంట్లను కలిసి కేక్‌కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ నూతన సంవత్సంలో అందరం బాగుండాలని రాష్ట్రం అభివృద్ధి చెందాలని గోరంట్ల అన్నారు..

ప్రెస్‌క్లబ్‌లో న్యూఇయర్ వేడుకలు

రాజమండ్రి ప్రెస్ క్లబ్‌లో బుధవారం న్యూఇయర్ వేడుకలు ఘనంగా జరిగాయి, సీనియర్ పాత్రికేయులు కృష్ణకుమార్, శైలేంద్ర, సాయిబాబా, ఐఅండ్‌పీఆర్ డీపీఆర్‌వో కాశి, శ్రీనివాస్, ఆచారిలు ముఖ్యఅతిథులుగా హాజరయ్యా రు. వారి చేత ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు కూడుపూడి సారధి, గౌరవాధ్యక్షుడు మండేల శ్రీరామ్మూర్తిలు కేక్ కట్ చేయించి జర్నలిస్టులందరికీ శుభాకాంక్షలు తెలిపారు. జర్నలిస్టుల సంక్షేమానికి ప్రెస్‌క్లబ్ చేసిన కృషిని అధ్యక్షుడు పార్థసారధి వివరించారు. జర్నలిస్టుల సమస్యలపై ఏపీయూజెడబ్ల్యు పక్షాన తీసుకుంటున్న చర్యలను ప్రభుత్వంతో చేస్తున్న అధినాయకత్వ సంప్రదింపులపై శ్రీరామ్మూర్తి వివరించారు. అక్రిడేషన్లు, హెల్త్ కార్డులపై డీపీఆర్వో మాట్లాడారు. 2024 డిసెంబరు 31తో కాలపరిమితి పూర్తయిన అక్రిడేషన్లను మరొక రెండు నెలలపాటు పొడిగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసిన నేపథ్యంలో గురువారం నుంచి అక్రిడేషన్ జర్నలిస్టులకు పొడిగింపు స్లిప్‌లనున కలెక్టర్ ఆదేశాలతో జారీ చేస్తున్నట్లు చెప్పారు. ఆత్మీయ విందును జర్నలిస్టులు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో వివిధ ప్రధాన పత్రికల ప్రతినిధులు, సబ్ ఎడిటర్లు, ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా పాత్రికేయులు, కెమెరామెన్‌లు పాల్గొన్నారు.

రాజమహేంద్రవరం కల్చరల్: వైసీపీ రాష్ట్ర యువజన విభాగ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే, జక్కంపూడి రాజా, స్థానిక ప్రకాశంనగర్‌లోని తన నివాసంలో బుధవారం నూతన సంవత్సర వేడుకలను జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో రాజమహేంద్రవరం పార్లమెంటరీ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ గూడూరి శ్రీనివాస్, మాజీ రుడా ఛైర్మన్ మేడపాటి షర్మిలరెడ్డి, వైసీపీ నాయకులు మేడా గురుదత్త ప్రసాద్, అభిమానులు, కార్యకర్తలు భారీగా తరలివచ్చి జక్కంపూడి రాజాకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అలాగే మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావు నివాసంలో నూతన సంవత్సర వేడుకలు రౌతు యువసేన ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. చాంబర్ పాలక వర్గ సభ్యులు, నాయీ బ్రాహ్మణ సంఘం, విశ్వబ్రాహ్మణ సంఘం, విజిటబుల్ మార్కెట్ సభ్యులు, తదితరులు వచ్చి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అశోక్‌కుమార్ జైన్, నందెపు శ్రీను, వాకచర్ల కృష్ణ, మజ్జి అప్పారావు, నూకరత్నం, బళ్ళ శ్రీనివాస్, సత్యవతి, పిల్లి నిర్మల, కనకాల రాజా, అరవ సురేష్ తదితరులు శుభాకాంక్షలు తెలియజేశారు.


మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావుకు శుభాకాంక్షలు తెలుపుతున్న దృశ్యం


రాజమహేంబ్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్లకు శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు


గోరంట్ల రామ్‌కిరణ్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న కార్యకర్తలు

మహాసభలు విజయవంతం కోరుతూ యూటీఎఫ్ ర్యాలీ

రాజమహేంద్రవరం అర్బన్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యూటీఎఫ్) స్వర్ణోత్సవ మహాసభలు విజయవంతం కావాలని కోరుతూ బుధవారం ప్రచార ర్యాలీ నిర్వహించారు. యూటీఎఫ్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో జరిగిన ఈ ర్యాలీ కంబాలచెరువు సెంటర్ నుంచి డీలక్స్ సెంటర్ మీదుగా నందం గనిరాజు సెంటర్ వరకూ జరిగింది. ర్యాలీని రాష్ట్ర కార్యదర్శి ఎన్.అరుణకుమారి ప్రారంభించి మాట్లాడుతూ యూటీఎఫ్ ఏర్పాటైన నాటి నుంచి ఉపాధ్యాయుల హక్కుల సాధన కోసం అనేక పోరాటాలు చేసి విజయం సాధించిందని అన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.షరీఫ్, సహాధ్యక్షురాలు ఎం.విజయగౌరి, కోశాధికారి ఈవీఎస్ఆర్ ప్రసాద్, ఇతర నాయకులు పాల్గొన్నారు.


మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజాకు శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు


బలభద్రపురంలో శ్రీనివాసుడికి కొబ్బరి బొండాలు, తలంబ్రాల కొబ్బరి చిప్పలను బహూకరిస్తున్న పీడీ యువరాజారెడ్డి

వేంకటేశ్వరుని కల్యాణానికి కొబ్బరి బొండాలు బహూకరణ

బిక్కవోలు, జనవరి 1(ఆంధ్రజ్యోతి): బలభద్రపురంలోని శ్రీదేవి భూదేవి సమేత ప్రసన్న వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం నిర్వహించే గోదాదేవి కల్యాణానికి గొల్లల మామిడాడకు చెందిన పీడీ యువరాజారెడ్డి శంఖు, చక్ర నామ కొబ్బరి బొండాలను, కల్యాణంలో వినియోగించే కొబ్బరి చిప్పలను బుధవారం బహూకరించారు. ఈయన వెంట గ్రామానికి చెందిన ద్వారంపూడి వెంకటకృష్ణారెడ్డి దంపతులు, తేజ పాల్గొన్నారు.

8న సంక్రాంతి ముగ్గుల పోటీలు

దివాన్‌చెరువు, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): దివాన్‌చెరువులోని వినయ్ విద్యావిహార్ స్కూల్ ప్రాంగణంలో ఈనెల 8న మహిళలకు సంక్రాంతి ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నట్లు వినయ్ విద్యా విహార్ ఛైర్మన్ సుంకర వెంకటేశ్వరరావు బుధవారం తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొనదలచిన మహిళలు 5వ తేదీలోపు తమ వివరాలను 94915 63344కి ఫోన్ చేసి నమోదు చేసుకోవాలని కోరారు. ఈ పోటీలలో పాల్గొనే వారు ముగ్గుకి సంబంధించిన రంగులు తెచ్చుకోవాలని చెప్పారు. విజేతలకు మొదటి బహుమతిగా రూ5వేలు, రెండవ బహుమతిగా రూ3 వేలు, మూడవ బహుమతిగా రూ.2వేలు అందిస్తామన్నారు. దీనితో బాటు రెండు కన్సొలేషన్ బహుమతులుగా ఒక్కొక్కరికి వెయ్యి చొప్పున అందిస్తామని తెలిపారు.

లక్ష్య సాధనతో విజయాలు సాధించాలి


మాట్లాడుతున్న జీజీయు చాన్సలర్ చైతన్యరాజు

రాజానగరం, జనవరి 1(ఆంధ్రజ్యోతి): నిర్దేశించుకున్న లక్ష్యాలతో విజయాలు సాధించాలని గోదావరి గ్లోబల్ విశ్వ విద్యాలయం వైస్ చాన్సలర్ కేవీవీ సత్యనారాయణరాజు (చైతన్యరాజు) ఆకాంక్షించారు. జీజీయు ప్రాంగణంలో బుధవారం జరిగిన నూతన సంవత్సర వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లా డారు. ఈసందర్భంగా జీజీయు సాధించిన ప్రగతిని వివరించారు. పీహెచ్‌డీ చేసే వారికి సహకారం అందించడానికి గగు సదా సిద్ధంగా ఉంటుందని చెప్పారు. 2025లో చేపట్టబోయే ప్రణాళికలను వివరించిన ఆయన గగు విద్యా ర్థుల భవిష్యత్తు వికాసానికి ఇక విశిష్ట వేదికగా నిలుస్తుందన్నారు. సమావేశంలో డైరెక్టర్ ఎం. శ్రీనివాసరావు, రిజిస్ట్రార్ పిఎంఎంఎస్ శర్మ, డీన్ ఎన్.లీలావతి, ప్రిన్సిపాల్ టి.జయా నందకుమార్, ఎం.డి.ధనరాజు, ఎంవిఎస్ బాబు, పి.జి.రామానుజం, కె.వల్లీ మాధవి, టీవీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అల్లూరి త్యాగాలు మరువకూడదు


గంగంపాలెంలో అల్లూరి సీతారామరాజు విగ్రహాన్ని ఆవిష్కరించిన దృశ్యం

గోకవరం, జనవరి 1(ఆంధ్రజ్యోతి): దేశం కోసం మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు చేసిన త్యాగాలను ఏ ఒక్కరూ మరువరాదని అఖిల భారత రైతుకూలీ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పల్ల వెంకట నాయుడు అన్నారు. మండలంలోని గంగంపాలెం గ్రామంలో ఏర్పాటు చేసిన అల్లూరి సీతారామరాజు విగ్రహాన్ని ఆవిష్కరించిన కార్యక్రమంలో బుధవారం ఆయన పాల్గొన్నారు. ఈసందర్భంగా దేశం కోసం సీతారామరాజు చేసిన సేవలను, త్యాగాలను ఆయన కొనియాడారు.


అనపర్తి మండలం రామవరంలో ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతున్న తెలుగు మహిళ కమిటీ ప్రతినిధులు


కోరుకొండలో ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ ఇంటి వద్ద నూతన సంవత్సర వేడుకలు నిర్వహిస్తున్న దృశ్యం

ఘనంగా నూతన సంవత్సర వేడుకలు

అనపర్తి, జనవరి 1(ఆంధ్రజ్యోతి): అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి నివాసంలో బుధవారం నూతన సంవత్సర వేడుకలు నిర్వహి ంచారు. అనపర్తి మండలం రామవరంలోని ఎమ్మెల్యే నివాసానికి చేరుకున్న పలువురు కూటమి నాయకులు, ప్రజా ప్రతినిధులు, అధికారులు ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలిపారు. అనపర్తి, బిక్కవోలు, రంగంపేట, పెదపూడి మండలాలకు చెందిన పలు శాఖల అధికారులు , ప్రజా ప్రతినిధులు, కూటమి నాయకులు ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలిపారు. అనపర్తి సీఐ సుమంత్, ఎస్ఐ శ్రీను నాయక్ ఆధ్వర్యంలో పోలీసులు శుభాకాంక్షలు తెలిపారు. నియోజకవర్గ తెలుగు మహిళా కమిటీ ఆధ్వర్యంలో కర్రి శేషారత్నం, జుత్తుగ సూర్యకుమారి, బేరా వేణమ్మ ఆధ్వర్యంలో తెలుగు మహిళలు ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలిపారు. రంగంపేట ఎక్సైజ్ సీఐ సుధ, ఐసీడీఎస్ సీడీపీవో జెస్సీ, అంగన్‌వాడీ సూపర్ వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలిపారు. అనపర్తి ఎమ్‌పీడీవో రామకృష్ణారెడ్డి, తహశీల్దార్ అనిల్‌కుమార్, ఎంఈవో నల్లమిల్లి సత్తిరెడ్డి తదితరులు శుభాకాంక్షలు తెలిపారు. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి నల్లమిల్లి మనోజ్‌రెడ్డిని కలిసిన పలువురు కూటమి నాయకులు, ప్రజా ప్రతినిధులు ఆయనకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అనపర్తిలోని జిల్లా వాణిజ్య విభాగ కార్యాయలంలో గోదావరి తూర్పు డెల్టా ప్రాజెక్టు కమిటీ వైస్ ఛైర్మన్ తమలంపూడి సుధాకరరెడ్డిని కలిసిన పలువురు కూటమి నాయకులు, నీటి సంఘాల అధ్యక్ష, ఉపాధ్యక్షులు, డీసీ ఛైర్మన్లు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. నియోజకవర్గంలోని పలు మండలాలలో కూటమి నాయకుల ఇళ్ల వద్ద నూతన సంవత్సర వేడుకల సందర్భంగా అభిమానులు, కార్యకర్తలు హాజరై శుభాకాంక్షలు తెలిపారు,

ఎమ్మెల్యేకు వేద పండితుల ఆశీర్వచనాలు

బిక్కవోలు: బిక్కవోలులో వేద పండితులు బుధవారం ఎమ్మెల్యే నల్లమిల్లి కుటుంబ సభ్యులకు వేద ఆశీర్వచనాలతో పాటు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. దేవదాయ శాఖ ఆర్‌జేసీ కె.సుబ్బారావు, బిక్కవోలు ఆలయాల ఈవో ఆకెళ్ల భాస్కర్ ఎమ్మెల్యేను కలసి బిక్కవోలు లక్ష్మీగణపతి, కుమార సుబ్రహ్మణ్యస్వామి చిత్రపటాలను బహూకరించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో లక్ష్మీగణపతి ఆలయ ఛైర్మన్ చాగంటి సాయిబాబారెడ్డి, పల్లి రాజారెడ్డి, బేరా గోవిందు, నందిపాటి కిషోర్ కుమార్‌రెడ్డి, వెంకట్రామయ్య పాల్గొన్నారు. మండల యూటీఎఫ్ నేతలు గోవిందరావు, అంజనీకుమార్, తదితరులు ఎమ్మెల్యేను కలసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపి యూటీఎఫ్ డైరీ, క్యాలెండర్ అందించారు.

భక్తులతో ఆలయాలు కిటకిట

కోరుకొండ: న్యూ ఇయర్ వేడుకలను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. కోరుకొండ శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం, వెంకటేశ్వరస్వామి దేవస్థానం, విశ్వేశ్వరస్వామి దేవస్థానం, బూరుగుపూడి సాయిబాబా ఆలయం భక్తులతో కిటకిటలాడింది. కోరుకొండ ఆర్టీసీ బస్‌స్టేషన్ ఎదురుగా గల వెంకటేశ్వరస్వామి ఆలయం వద్ద భక్తులు ధనుర్మాసాన్ని పురస్కరించుకుని తిరుప్పావై పారాయణం చేశారు. గాదరాడ, నర్సాపురం, శ్రీరంగపట్నం, బూరుగుపూడి, దోసకాయలపల్లి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

ఎమ్మెల్యే ఇంటి వద్ద సందడి

కోరుకొండ: నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని బూరుగుపూడి గేటు వద్ద గల టీడీపీ కార్యాలయం, ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ స్వగృహం వద్ద కూటమి నాయకులు, కార్యకర్తలు, ప్రజా ప్రతినిధులు, అధికారులతో సందడి నెలకొంది. బొకేలు, బహుమతులు తీసుకురావద్దని బత్తుల బలరామకృష్ణ, బొడ్డు వెంకటరమణ చౌదరి చెప్పినప్పటికీ ఎవరూ పట్టించుకోలేదు. బొకేలు, కేక్‌లు, శాలువా, దండలతో నేతల ఇళ్లకు బారులుతీరారు. ఉదయం 5గంటల నుంచే అభిమానులతో సందడిగా మారింది.

ఆలయాల్లో భక్తుల పూజలు

కడియం: మండలంలో నూతన సంవత్సర వేడుకలు ఘనంగా జరిగాయి. ఉదయం నుంచే ఆలయాల వద్ద భక్తులు బారులుతీరారు. గణపతి, ఆంజనేయ, దుర్గాదేవి, వేంకటేశ్వరస్వామి, శివాలయం, రామాలయం తదితర ఆలయాలు భక్తులతో రద్దీగా మారాయి. గ్రామాల్లోని పలువురు ప్రజా ప్రతినిధులకు కార్యకర్తలు, నాయకులు, అధికారులు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

రంగవల్లులతో మహిళల సందడి

గోకవరం: మండలంలో నూతన సంవత్సర వేడుకలు ఘనంగా జరిపారు. మహిళలు, యువతులు ఇళ్ల ముందు రంగవల్లులతో సందడి చేశారు. మండలంలోని ఆలయాల్లో ప్రత్యేక, అభిషేకాలు పూజలు చేశారు.


క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న దృశ్యం

టీఎన్‌యూఎస్ క్యాలెండర్ ఆవిష్కరణ

కడియం, జనవరి 1(ఆంధ్రజ్యోతి): తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం క్యాలెండర్‌ను బుధవారం ఎంపీపీ వెలుగుబంటి ప్రసాద్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు వెలుగుబంటి నాని, టీఎన్‌యూఎస్ నాయకులు కే. జయరాజు, రిమ్మలపూడి సత్యనారాయణ, జిల్లా గౌరవ అధ్యక్షుడు వి.లజపతిరాయ్, అధ్యక్షులు ఉండవిల్లి సత్యనారాయణ, సురేష్ కుమార్, కృష్ణమూర్తి తదితరులు ఉన్నారు.


బీజేపీ మండల అధ్యక్షుడిగా సుబ్రహ్మణ్యం

కడియం, జనవరి 1(ఆంధ్రజ్యోతి): కడియం మండలం బీజేపీ అధ్యక్షులుగా కడియపులంక గ్రామానికి చెందిన బొర్సు సుబ్రహ్మణ్యం ఎన్నికయినట్లు ఆర్‌వో కరుటూరి శ్రీనివాస్ తెలిపారు. బుధవారం జరిగిన బీజేపీ సమావేశం, అధ్యకుని ఎన్నిక కార్యక్రమంలో రూరల్ కన్వీనర్ ఆకుల శ్రీధర్ ముఖ్యఅతిధిగా పాల్గొన్నారు. మండల అధ్యక్షుడిగా సుబ్రహ్మణ్యంను ఎన్నిక చేసారు. బీజేపీ నాయకులు నాగులపల్లి వీరబాబు, చిక్కాల ఈశ్వరరావు, గుత్తుల హరిప్రసాద్, చిక్కాల శ్రీను, మంచెం దుర్గారావు, కొటికలపూడి వెంకటేశ్వరరావు, పెనుమాక శేషగిరి, గారపాటి తాతబ్బాయి, పాటంశెట్టి రాజేష్, తదితరులు అభినందనలు తెలిపారు.


సుబ్రహ్మణ్యంను అభినందిస్తున్న బీజేపీ నాయకులు

రాజమండ్రిలో 207వ భీమా కోరేగావ్ విజయోత్సవ దినోత్సవం

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 1(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరంలో భీమాకోరేగావ్ విజయోత్సవ దినోత్సవాన్ని దళిత సంఘాల నేతలు ఘనంగా నిర్వహించారు. 28వేల మంది మనువాదులపై 500 మంది బహుజనులు పూణేలోని కోరేగావ్‌లో 1818 జనవరి 1న చేసిన యుద్ధంలో బహుజనులు విజయం సాధించి నేటి 207 రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ విజయోత్సవ ప్రదర్శన చేశామని నేతలు మర్రి బాబ్జి, ఇసుకపట్టి రాంబాబు, పరమట గణేశ్వరరావు, పట్నాల విజయకుమార్, నక్కా వెంకటరత్నం, లాజర్‌లు తెలిపారు. రాజమహేంద్రవరం గోకవరం బస్టాండ్ అంబేడ్కర్ విగ్రహంవద్ద వారు స్వీట్లు తినిపించుకున్నారు.





సాయం సంధ్యలో..

రాజమహేంద్రవరంలోని గోదావరి తీరంలో బుధవారం సాయంత్రం సూర్యుడి అస్తమిస్తున్న వేళ కనువిందు చేసే దృశ్యం

నూతనోత్సాహంతో ప్రభుత్వ పథకాలను అమలుచేద్దాం

- జిల్లా కలెక్టర్ ప్రశాంతి
- నూతన సంవత్సర దినోత్సవ స్ఫూర్తిగా సమష్టిగా పనిచేయాలి
- న్యూఇయర్ వేడుకలు





కలెక్టర్ ప్రశాంతికి శుభాకాంక్షలు తెలుపుతున్న జేసీ చిన్నరాముడు, నగర మున్సిపల్ కమిషనర్ కేతన్‌గార్గ్

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): నూతన సంవత్సర వేళ ప్రభుత్వ ప్రాధాన్యత పథకాలను నూతనోత్సాహంతో సమర్థవంతంగా అమలుచేద్దామని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. బుధవారం కలెక్టర్ చాంబర్‌లో తనను కలిసి శుభాకాంక్షలు తెలిపిన అధికారులతో కలెక్టర్ మాట్లాడారు. ప్రభుత్వం ఎన్నో సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేయడం జరుగుతోందని, వాటిని విజయవంతంగా ప్రజలకు చేరవేయడంలో సమన్వయంతో పనిచేయాలని కోరారు. నూతన సంవత్సర దినోత్సవ స్ఫూర్తితో సమష్టిగా పనిచేయడం ద్వారా జిల్లాను అగ్రస్థానంలో నిలిపేలా అడుగులు వేద్దామన్నారు. కలెక్టర్‌కు జేసీ చిన్నరాముడు, నగర కమిషనర్ కేతన్‌గార్గ్, ఆర్డీవోలు ఆర్.కృష్ణనాయక్, రాణీ సుస్మిత తదితరులు శుభాకాంక్షలు తెలిపారు. మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ మృతి కారణంగా సంతాపదినాలు కావడంలో వేడుకలను ఈసారి నిరాడంబరంగా చేశారు.



ఫుల్‌గా తాగారు!

- జిల్లాలో రెండు డిపోల పరిధిలో రూ.23 కోట్ల
- గతంకంటే తగ్గిందనే వాదన
- డిసెంబరు నెలలో రూ.183 కోట్లు
- అయినా ముభావంగా వ్యాపారులు



(రాజమహేంద్రవరం - ఆంధ్రజ్యోతి)

పాత సంవత్సరానికి వీడ్కోలు.. కొత్త ఏడాదికి స్వాగతం పేరుతో తాగేవాళ్లు బాగానే తాగారు. డబ్బు లేనివాళ్లు తగ్గించారు... కొందరు సారా తోనూ, కల్లుతోనూ సరిపెట్టుకున్నారు. అయినా ప్రతీ ఏటా మాదిరిగా ఈ ఏడు కూడా మద్యం ఏరులైపారింది. కానీ గతంలో అంతంగా అమ్మకాలు లేవని మద్యం వ్యాపారులు చెప్పడం గమనార్హం. జిల్లాలో 125 మద్యం దుకాణాలు, 21 బార్లు ఉన్నాయి. రాజమహేంద్రవరం, చాగల్లు మండలం పరిధిలో ఎక్సైజ్ డిపోలు ఉన్నాయి. ఈ రెండు డిపోల పరిధి నుంచి డిసెంబర్ 30, 31 తేదీల్లో సుమారు రూ.23 కోట్ల మద్యం అమ్మకాలు జరిగాయి. డిసెంబరు నెల మొత్తం రూ.183 కోట్లు విక్రయాలు జరిగాయి. అయినా మద్యం వ్యాపారులు ముభావంగానే ఉన్నారు. సాధారణంగా ప్రతీ రోజూ జిల్లాలో జిల్లాలోని 125 మద్యం దుకాణాలు, 21 బార్లల ద్వారా సుమారు 8 నుంచి 9 కోట్ల వరకూ అమ్మకాలు ఉంటాయి. డిసెంబర్ 30, 31 తేదీల్లో పాత సంవత్సరం వెళ్లిపోతోందనే బాధతో గత అనుభవాలను నెమరవేసుకుంటూ, కొత్త సంత్సరానికి స్వాగతం పలుకుతూ డిసెంబర్ 31వ తేదీ తెల్లవారూ అనేకమంది ఎంజాయ్ చేస్తారు. ఇందులో మద్యం వినియోగమే ఎక్కువ. రాజమహేంద్రవరం వంటి నగరాల్లో పబ్‌లు, హోటళ్లు కిటకిటలాడాయి. తెల్లవారూ సందడే సందడి.. తాగేవాళ్లు తాగినంత తాగారు. న్యూ ఇయర్‌కి రాజమహేంద్రవరం డిపో నుంచి రూ. 12 కోట్ల సరుకు షాపులకు వచ్చింది. ఇది రాజమండ్రి డివిజన్‌లోని దుకాణాలతోపాటు ఏజెన్సీకి కొంత, అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని కొన్ని షాపులకు సరుకు వెళ్లింది. చాగల్లులోని మీనానగర్ డిపో నుంచి రూ.11 కోట్ల సరుకు షాపులకు వచ్చింది. పశ్చిమగోదావరి జిల్లాలోని కొన్ని షాపులకు కూడా వెళ్లింది. అందువల్ల ఈ సరుకు అంతా జిల్లాలోనే తాగినట్టు కాదని అధికారులు చెబుతున్నారు. కానీ బెల్ట్ షాపులు బాగా పెరగడం వల్ల ముందుగా కొనుగోలు చేసిన సరుకు కూడా అమ్మకాలు జరిగినట్టు ప్రచారం ఉంది. జిల్లాలో బెల్ట్ షాపులు బాగా పెరిగాయి. ఇక జిల్లాలో కొన్ని షాపుల్లో అమ్మకాలు జోరుగా సాగాయి. కొన్ని దుకాణాల్లో మాత్రం అమ్మకాలు డల్‌గా ఉన్నట్టు అధికారులు కూడా చెబుతున్నారు. రాజమహేంద్రవరం పరిధిలో ఏసీ గార్డెన్స్‌లోని దుకాణంలో మొదటినుంచి అమ్మకాలు బాగా జరుగుతున్నాయి. ఇక్కడ ఒకటే షాపు ఉంది. మండలం యూనిట్‌గా అనుమతి ఇవ్వడంతో ఎవరికి ఇష్టమైన చోట వాళ్లు దుకాణాలు పెట్టుకోవడంతో కూడా ఈ పరిస్థితి ఉన్నట్టు చెబుతున్నారు. లాలా చెరువులో ఏకంగా నాలుగు షాపులు దగ్గరలో పెట్టేయడం గమనార్హం. గతంలో వ్యాపారులంతా సిండికేట్ అయ్యేవారు. ఈసారి ఇంకా పూర్తిస్థాయిలో సిండికేట్ కాలేదని చెబుతున్నారు. పైగా ఈసారి రాజకీయ నేతలు కూడా ఈ వ్యాపారంలో ఉండడంతో కూడా సిండికేట్‌కు కొంత ఇబ్బందిగా ఉన్నట్టు కూడా ప్రచారం సాగుతోంది. ఈ పరిస్థితుల్లోనే కొందరు బాగా అమ్ముకుంటుంటే, కొందరు డల్‌గా ఉందని చెబుతున్నారు.

20 శాతం కమీషన్ బెంగ

మద్యం వ్యాపారుల్లో 20శాతం కమీషన్ రాక పోవడంతో బెంగ పెట్టుకున్నారు. సాధారణంగా బెంగ ఉన్నవాళ్లు లిక్కర్ తాగుతుంటారు. లిక్కర్ వ్యాపారులే బెంగ పెట్టుకుంటే ఇంకెవరికి చెప్పాలి. ప్రభుత్వం మొదట్లో 20 శాతం కమిషన్ ఇస్తానని హామీ ఇచ్చింది. కానీ ఇటీవల కేవలం 9నుంచి 10శాతం వరకే కమీషన్ ఇస్తున్నట్టు వ్యాపారులు చెబుతున్నారు. ప్రభుత్వం హామీ ఇచ్చిన మేరకు కమీషన్ ఇస్తే, ఈసారి అమ్మకాల్లో కూడా లాభాలు కనిపించేవి. వారు ఆనందంగా ఉండేవారు. కానీ ఇవాళ నూతన సంవత్సరానికి స్వాగతం, పాత సంవత్సరానికి వీడ్కోలు పేరిట గత నెల 30,31 తేదీల్లో సరుకుతోపాటు బుధవారం సుమారు రూ.8 కోట్ల వరకూ తాగినట్టు చెబుతున్నారు. అంటే ఈ మూడు రోజుల్లో సుమారు రూ.31 కోట్ల వరకూ అమ్ముడైనట్టు అంచనా. ఇందులో వ్యాపారులకు 20శాతం కమీషన్ ఉంటే ఆనందంగా ఉండేవారు. కానీ ఎక్కువ ఆదాయం రాష్ట్ర ప్రభుత్వానికి వెళ్లింది. వ్యాపారులు, ప్రభుత్వమూ ఎలా ఉన్నా మద్యం బాబులు మాత్రం ఏటా మాదిరిగా ఈ ఏడు కూడా ఫుల్‌గా తాగి, జేబులు, ఇల్లు, ఒళ్లు గుల్ల చేసుకున్నారు.



నిడదవోలులో బుధవారం ఆంగ్ల నూతన సంవత్సర వేడుకల్లో పాల్గొన్న మంత్రి కందుల దుర్గేష్

సరికొత్త ఆంధ్రప్రదేశ్‌ను నిర్మించుకుందాం : కందుల

నిడదవోలు, జనవరి 1(ఆంధ్రజ్యోతి): కొత్త సంవత్సరంలో రాష్ట్ర అభివృద్ధికోసం కలసి కట్టుగా పనిచేసి సరికొత్త ఆంధ్రప్రదేశ్‌ను నిర్మించుకుందామని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక సినిమాటోగ్రఫీశాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. బుధవారం నిడదవోలు పట్టణంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో ఆంగ్ల నూతన సంవత్సర వేడుకలు జరిగాయి. ఈసందర్భంగా మంత్రి దుర్గేష్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి కట్టుబడి ఉందని, త్వరలోనే రాష్ట్రంలోని ప్రజలంతా సంక్షేమ అభివృద్ధి ఫలాలను చూస్తారన్నారు. మంత్రి దుర్గేష్‌ను వేద పండితులు వేద మంత్రోచ్ఛరణలతో ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, వైస్‌చైర్మన్ గంగుల వెంకటలక్ష్మి, కౌన్సిలర్లు కారింకి నాగేశ్వరరావు, చిలకల శారదాదేవి, ఎండీ షాకీరాబేగం, జనసేన నాయకులు మద్దిపాటి ఫణీంద్ర, రంగా రమేష్‌లు మంత్రికి శుభాకాంక్షలు తెలిపారు.

ఎస్సీ కులగణన పై సోషల్ ఆడిట్ పూర్తికి గడువు పొడిగింపు

రాజమహేంద్రవరంసిటీ, జనవరి1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఎస్సీల జనాభా గణనపై సోషల్ ఆడిట్ పూర్తి చేయడానికి గడువును పొడిగించినట్టు ఎస్సీ సంక్షేమ సాధికారత అధికారి ఎం.శోభారాణి తెలిపారు. బుధవారం సాయంత్రం ఒక ప్రకటన విడుదల చేశారు. గత నెల 26 నుంచి ఈనెల 7వ తేదీ వరకు గడువును పొడిగించారని, అభ్యంతరాలను ఈనెల 11వ తేదీ వరకు క్షేత్రస్థాయిలో పరిశీలిస్తారని తెలిపారు. సమగ్ర వివరాలు గ్రామ వార్డు సచివాలయాల్లో ప్రదర్శిస్తారని తెలిపారు. ఈ మేరకు జీవో జారీ అయ్యిందన్నారు.

జర్నలిస్టులకు అక్రిడేషన్ కార్డుల గడువు రెండు నెలలు పొడిగింపు : కలెక్టర్

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 1 (ఆంధ్రజ్యోతి):రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు జిల్లాలో 2024 డిసెంబరు 31తో ముగిసిన జర్నలిస్టుల అక్రిడేషన్ కార్డుల కాలపరిమితి జనవరి 1 నుంచి ఫిబ్రవరి 28వ తేదీ వరకు రెండు నెలలపాటు పొడిగిస్తున్నామని జిల్లా కలెక్టర్ పి ప్రశాంతి తెలిపారు. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ మేరకు బస్సు పాస్‌ల కోసం ఆర్టీసీకి లేఖ రాయడం జరిగిందని తెలిపారు. గురువారం నుంచి జిల్లా సమాచార పౌరసంబంధాల శాఖ కార్యాలయం నుంచి గడువు పొడిగింపు స్లిప్‌లు పంపిణీ చేస్తామని ఆ శాఖ అధికారి సీహెచ్ శ్రీనివాస్, డీపీఆర్‌వో ఐ కాశయ్య తెలిపారు.





సింహ వాహనంపై మలయప్పస్వామి అవతారంలో ఊరేగుతున్న శ్రీనివాసుడు.. పక్కన శ్రీదేవి, భూదేవి సమేత స్వామి వారు

సింహ వాహనంపై మాడవీధుల్లో ఊరేగిన శ్రీనివాసుడు

బిక్కవోలు, జనవరి1(ఆంధ్రజ్యోతి): తూర్పు తిరుమలగా పేరొందిన బలభద్రపురం శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వెంకటేశ్వరస్వామి ద్వితీయ బ్రహ్మోత్సవాలు బుధవారం తొమ్మిదవ రోజుకు చేరాయి. ఉదయం సుప్రభాత సేవతో కార్యక్రమాలు ప్రారంభించి సహస్ర కలశాభిషేకం, సుగంధ పుష్పాభిషేకం, మార్గ శీర్ష వ్రతం కార్యక్రమాలు జరిపారు. రాత్రి గోవింద నామ స్మరణల మధ్య సింహ వాహనంపై శ్రీమలయ్యప్పస్వామి అవతారంలో స్వామి అమ్మవార్లను మాడ వీధుల్లో ఊరేగించారు. స్వామి దర్శనానికి వచ్చిన భక్తులకు ఆలయ కమిటీ చైర్మన్ మల్లిడి గంగారెడ్డి అన్న ప్రసాదాన్ని ఏర్పాటుచేశారు. ఈ బ్రహ్మోత్సవాలకు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

వంద మంది పురోహితులకు రగ్గులు పంపిణీ

రాజమహేంద్రవరంసిటీ, జనవరి 1(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరంలో ఆంధ్రజ్యోతితో పాటు మరొక ప్రధాన పత్రికలో చలి తీవ్రతపై వచ్చిన కథనాలకు స్పందించి ఎన్‌వోసీ ట్రస్ట్ ఆధ్వర్యంలో స్థానిక మార్కండేయ స్వామి ఆలయంలో వందమంది వేదపండితులకు రగ్గులు అందించారు. ఈ సేవలు రాజమహేంద్రవరంలో కొనసాగిస్తున్నట్లు బుధవారం శ్రీరాజ్ తెలిపారు.



నూతన సంవత్సర వేడుకలలో ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావుకి శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు, అధికారులు





కేక్ కట్‌చేస్తున్న కొవ్వూరు ఆర్డీవో డాక్టర్ రాణి సుస్మిత, డీఎస్పీ దేవకుమార్, కొవ్వూరు పట్టణ, మండల సీఐలు, ఎస్ఐలు



కేంద్రపార్టీ కార్యాలయంలో సీఎం చంద్రబాబును కలిసిన ఎమ్మెల్యే మద్దిపాటి

కొత్త సంవత్సరంలో
అందరూ సంతోషంగా ఉండాలి

• ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు • ఘనంగా నూతన సంవత్సర వేడుకలు

కొవ్వూరు, జనవరి 1(ఆంధ్రజ్యోతి): కొత్త సంవత్సరంలో అందరూ సంతోషంగా, ఆనందంగా ఉండాలని కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. బుధవారం కొవ్వూరు నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో నూతన సంవత్సర వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు కేక్ కట్ చేసి నియోజకవర్గ ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. నియోజకవర్గంలోని కొవ్వూరు, తాళ్లపూడి, చాగల్లు మండలాలకు చెందిన ఎన్డీఏ కూటమి నాయకులు, కార్యకర్తలు, వివిధ ప్రభుత్వశాఖల అధికారులు, ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావును కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రతిఒక్కరూ నూతన ఉత్సాహంతో సరికొత్త ఆలోచనలతో నూతన సంవత్సరంలోకి అడుగుపెట్టాలన్నారు. కార్యక్రమంలో కొవ్వూరు నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే టీవీ.రామారావు, ద్విసభ్య కమిటీ సభ్యులు కంటమణి రామకృష్ణారావు, జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి, అర్బన్‌బ్యాంకు చైర్మన్ మద్దిపట్ల శివరామకృష్ణ, మాజీ మున్సిపల్ చైర్మన్ సూరపనేని చిన్ని, పట్టణ, మండల అధ్యక్షుడు దాయన రామకృష్ణ, వట్టికూటి వెంకటేశ్వరరావు, తాళ్ళపూడి మండల అధ్యక్షుడు నామాన పరమేశ్వరరావు, నియోజకవర్గంలోని మూడు మండలాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు నాయకులకు పుష్పగుచ్ఛాలు, పండ్లు అందించి శుభాకాంక్షలు తెలిపారు.

●కొవ్వూరు నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే టి.వి. రామారావు నివాసంలో బుధవారం నూతన సంవత్సర వేడుకలు నిర్వహించారు. నియోజకవర్గంలోని మూడు మండలాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు నాయకులకు పుష్పగుచ్ఛాలు, పండ్లు అందించి న్యూయర్ శుభాకాంక్షలు తెలిపారు. కొవ్వూరు పట్టణంలోని టిడిపి రాజమహేంద్రవరం పార్లమెంటు జిల్లా కార్యాలయంలో నూతన సంవత్సర వేడుకలను ఘనంగా నిర్వహించారు. టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి కె.ఎస్.జవహర్ కేక్ కట్ చేసి రాష్ట్ర ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కొవ్వూరు మున్సిపల్ చైర్మన్ బావన రత్నకుమారి నివాసంలో నూతన సంవత్సర వేడుకలు నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ టి. నాగేంద్రకుమార్, పురపాలక సంఘ ఉద్యోగులు, నాయకులు చైర్‌పర్సన్‌ను కలుసుకుని నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కొవ్వూరు నియోజకవర్గ వైసీపీ ఇంచార్జి, మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు క్యాంపు కార్యాలయంలో నూతన సంవత్సర వేడుకలు నిర్వహించారు. కొవ్వూరు డీఎస్పీ కార్యాలయంలో నూతన సంవత్సర వేడుకలలో భాగంగా డీఎస్పీ జి.దేవకుమార్ కేక్ కట్‌చేసి శుభాకాంక్షలు తెలిపారు. సబ్‌డివిజన్ పరిధిలోని పోలీసులు అధికారులు పాల్గొన్నారు.

చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు

నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని కొవ్వూరు, పట్టణ, మండలంలోని చర్చిలలో బుధవారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కొవ్వూరు పట్టణం మెరకవీధిలోని సెయింట్ ఫాల్స్ లూథరన్ చర్చిలో ఫాస్టర్ రెవ.గెల్లా. రాజన్‌బాబు, క్రైస్ట్ లూథరన్ టౌన్ చర్చిలో సంఘకాపరి ఫాస్టర్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. పట్టణ, మండలంలోని అన్ని చర్చిలలో నూతన సంవత్సర వేడుకలను ఘనంగా నిర్వహించారు. అధికసంఖ్యలో సంఘస్తులు చర్చిలకు చేరుకుని ప్రత్యేక ప్రార్థనలతో క్రీస్తును ఆరాదించారు.

చాగల్లు: మండలంలో నూతన సంవత్సర వేడుకలను ప్రజలు ఆనందోత్సవాలతో జరుపుకున్నారు. మాజీ ఏఎంసీ చైర్మన్ ఆళ్ళ హరిబాబు గృహంలో కేక్ కట్ చేసి స్వీట్లు పంచారు. ఈ వేడుకల్లో అధికారులు, టీడీపీ నాయకులు పాల్గొని పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకున్నారు. తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ ఎం. మెరికమ్మ ఆధ్వర్యంలోను, ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ వీరాస్వామి ఆధ్వర్యంలో నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుకున్నారు. అనంతరం అధికారులు, టీడీపీ నాయకులు కొవ్వూరు తరలివెళ్లి ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావును కలిసి శుభాకాంక్షలు తెలిపారు. టీడీపీ నాయకులు నాదెళ్ళ శ్రీరామ్, కరుటూరి సతీష్, కేతా సాహెబ్, దొంగ రామకృష్ణ, బొల్లిన శివ నాగేంద్ర, రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ నాయకులు సుంకవల్లి రమేష్, హరికృష్ణ పాల్గొన్నారు.



దేవరపల్లిలో ఎంపీపీకి శుభాకాంక్షలు తెలుపుతున్న ఎంఈవో, ఉపాధ్యాయులు

దేవరపల్లి: మండలంలో ఘనంగా నూతన సంవత్సర వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. టీడీపీ, వైసీపీ అధికార, ప్రతిపక్ష పార్టీల కార్యాలయాల్లో సందడి నెలకొంది. యర్నగూడెంలో మాజీ హోంమంత్రి తానేటి వనితకు పార్టీ కార్యాలయంలో ఆమెను కలిసి వైసీపీ నాయకులు, కార్యకర్తలు శుభా కాంక్షలు తెలిపారు. దేవరపల్లిలో ఎంపీపీ కేవీకే దుర్గారావుకు మండల పరిషత్ అధికారులు, ఎంఈవోలు తిరుమలదాసు, అప్పారావు, ఉపాధ్యాయులు శుభాకాంక్షలు తెలిపారు. టీడీపీ నాయకులు, మాజీ మండల అధ్యక్షుడు సుంకర దుర్గారావు, టీడీపీ నాయకులు గన్నమని హరికృష్ణకు నా యకులు, కార్యకర్తలు, వివిధ సంఘాల నాయ కులు నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలి పారు. పల్లంట్లలో రాష్ట్ర మహిళా అధికార ప్రతినిధిని కొయ్యలమూడి సుధారాణి, మాజీ టీడీపీ మండల అధ్యక్షుడు కొయ్యలమూడి చినబాబుకు మండలంలోని టీడీపీ నాయకులు, కార్యకర్తలు, ఉద్యోగులు, శుభాకాంక్షలు తెలిపిన వారిలో ఉన్నారు. దేవరపల్లి వృద్ధాశ్రమంలో నాయీబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు కడియం సత్తిబాబు ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. మండల కార్యదర్శి జగతి, వీరాస్వామి, ఈతకోట రమేష్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఉండ్రాజవరం: మండలంలో బుధవారం నూతన సంవత్సర దినోత్సవాన్ని ప్రజలు ఆనందోత్సాహాలతో నిర్వహించారు. ఉదయం నుంచి ప్రజాప్రతినిధులు, అధికారుల వద్దకు నాయకులు, ఉద్యోగులు వెళ్లి శుభాకాంక్షలు తెలిపారు. మండలంలోని వేలివెన్ను గ్రామంలో పెరవలి డిస్ట్రిబ్యూటరీ కమిటీ అధ్యక్షుడు బూరుగుపల్లి శ్రీనివాసరావు ఇంటికి మండల టీడీపీ అధ్యక్షుడు సింహాద్రి రామకృష్ణ, నాయకులు రాచమళ్ల శ్రీనివాసరావు తదితరులు వెళ్లి శుభాకాంక్షలు తెలిపారు. అదేవిధంగా టీడీపీ మండల నాయకుడు సింహాద్రి రామకృష్ణ, ఎంపీ పీ పాలాటి యల్లారీశ్వరి, మాజీ సర్పంచ్ గన్నమని సుబ్రహ్మణ్యం, జడ్పీటీసీ సభ్యుడు నంది గం భాస్కర రామయ్య, వైసీపీ నాయకుడు బూ రుగుపల్లి సుబ్బారావును ఆయా పార్టీల నాయకులు, కార్యకర్తలు కలసి శుభాకాంక్షలు తెలిపారు. తహసీల్దార్ పీఎన్‌డీ ప్రసాద్, ఎంపీడీవో రామారావును ఉద్యో గులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. చర్చిలలో ప్రేమవిందులు ఏర్పాటు చేసారు. నూతనసంవత్సర కేక్‌లను కట్ చేశారు.

సీఎంను కలిసిన ఎమ్మెల్యే మద్దిపాటి

గోపాలపురం: నూతన సంవత్సరం సందర్భంగా ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు కేంద్ర పార్టీ కార్యాలయంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబును కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ముఖ్యమంత్రి ఆశీర్వాదం తీసుకున్న ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు నియోజకవర్గంలో ఉపాధి హామీ నిధులు మంజూరు చేయడంతో పల్లెపల్లెకు సీసీరోడ్లు నిర్మించి ప్రారంభానికి సిద్ధం చేశామని తెలిపామన్నారు. నియోజకవర్గంలో దశాబ్ధాల తరబడి పెండింగ్‌లో ఉన్న జ్యోతిరావు పూలే బాలికల ఆశ్రం పాఠశాల, అగ్నిమాపక కేంద్రం, తదితర సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు.



కేక్ కట్‌చేస్తున్న కొవ్వూరు మాజీ ఎమ్మెల్యే తలారి



కొవ్వూరు లూథరన్ చర్చిలో సందేశాన్ని అందజేస్తున్న ఫాస్టర్ రెవ. రాజన్‌బాబు



వేలివెన్నులో బూరుగుపల్లి శ్రీనివాసరావును కలసి శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు



చాగల్లులో మాజీ ఏఎంసీ చైర్మన్ ఆళ్ళ హరిబాబుకు శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు



ప్రత్యేక అలంకరణలో కోట సత్తెమ్మ అమ్మవారు

కొత్త సంవత్సరం కోట సత్తెమ్మకు ప్రత్యేక పూజలు

నిడదవోలు, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): ఆంగ్ల నూతన సంవత్సరం మొదటిరోజు బుధవారం నిడదవోలు మండలం తిమ్మరాజుపాలెం గ్రామంలో ఉన్న కోటసత్తెమ్మ అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. కొత్త సంవత్సరం మొదటిరోజు కావడంతో ప్రత్యేక అలంకరణలో ఉన్న అమ్మవారిని భక్తులు పెద్ద ఎత్తున దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అమ్మవారికి నిర్వహించిన పూజలలో భక్తులు పాల్గొన్నారు.

ప్రముఖ జ్యోతిష్యుడు సత్యనారాయణ చౌదరిమృతి



నల్లజర్ల, జనవరి 1(ఆంధ్రజ్యోతి): సింగరాజుపాలెం గ్రామానికి చెందిన ప్రముఖ జ్యోతిష్యుడు కొరారు సత్యనారాయణ చౌదరి(75)అనారోగ్యంతో హైదరాబాద్ అపోలో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. గురువారం ఆయన అంత్యక్రియలు సింగరాజుపాలెంలో జరుగుతాయన్నారు. సత్యనారాయణచౌదరి అనేక సినిమాలకు ముహూర్తాలు పెట్టేవారని, అంతేకాకుండా వాస్తు సిద్ధాంతిగా పేరు సంపాదించాడు. బాలకృష్ణవద్ద వ్యక్తిగత జ్యోతిష్యునిగా పనిచేశారు. సత్యనారాయణ చౌదరికి భార్య అనసూయ, కుమారుడు శ్రీనివాసరావు, కుమార్తె నాగమణి ఉన్నారు.

స్కూల్ బస్సును అడ్డగించిన ఇద్దరిపై కేసు నమోదు

కొవ్వూరు, జనవరి 1 (ఆంధ్రజ్యోతి) : స్కూల్ బస్సును అడ్డగించి రాళ్లతో అద్దాలు బద్దలుకొట్టి విద్యార్థులను భయభ్రాంతులకు గురిచేసిన ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు కొవ్వూరు పట్టణ ఎస్ఐ కె.జగన్మోహనరావు తెలిపారు. కొవ్వూరు అభ్యాస పాఠశాల స్కూల్ బస్సులో బుధవారం విద్యార్థులను దొమ్మేరు సావరంలో దింపడానికి బయలుదేరింది. ఎలిమెంటరీ పాఠశాలవద్ద తోర్లపూడి విజయశేఖర్, ఈదూరి ప్రకాష్‌లు బస్సును అడ్డగించి రాళ్లతో బస్సు అద్దాలు బద్దలు కొట్టారు. డ్రైవర్ ఉప్పులూరి దుర్గాప్రసాద్‌పై దాడిచేశారు. విధ్యార్థులను భయభ్రాంతులకు గురిచేయడంతో దుర్గాప్రసాద్ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ జగన్మోహనరావు తెలిపారు.

బీరు బాటిల్‌తో దాడిచేసిన ముగ్గురిపై కేసునమోదు

కొవ్వూరు, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): బీరు బాటిల్‌తో దాడిచేసి వ్యక్తిని చంపడానికి ప్రయత్నించిన ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు కొవ్వూరు పట్టణ ఎస్ఐ కె.జగన్మోహనరావు తెలిపారు. కొవ్వూరు మండలం దొమ్మేరు సావరంలో డిసెంబరు 31వ తేదీ రాత్రి తోర్లపూడి విజయశేఖర్, ఈదూరి ప్రశాంత్, ఈదూరి ప్రకాష్‌లు ముగ్గురు టపాసులు కాలుస్తుండగా బొంతా రాజు అడిగాడు. అది మనసులో పెట్టుకుని బుధవారం మధ్యాహ్నం బొంతా రాజును దొమ్మేరు సావరంలో అరటితోట వద్ద ముగ్గురు కలిసి బీరు బాటిల్‌తో కొట్టి దాడిచేసి చంపడానికి ప్రయత్నించగా చేతులు అడ్డుపెట్టాడు. చేతులకు గాయాలయ్యాయి. బొంతా రాజు అందించిన ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసినట్లు ఎస్ఐ జగన్మోహనరావుతెలిపారు.

ఐదుగురు పేకాట రాయుళ్ల అరెస్టు

కొవ్వూరు, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): పేకాట ఆడుతున్న 5గురిని అరెస్టు చేసినట్లు కొవ్వూరు రూరల్ ఎస్ఐ కె.శ్రీహరిరావు తెలిపారు. కుమారదేవం గ్రామశివారులో పేకాట ఆడుతున్నారని సమాచారం రావడంతో పోలీసులు దాడిచేశారు. మల్లిపూడి రామారావు, మరో నలుగురిని అరెస్టు చేసి, వారివద్ద నుంచి రూ. 4050లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మానవాళి సుఖశాంతులతో ఉండాలి

• గౌరీపట్నం నిర్మలగిరి పుణ్యక్షేత్ర డైరెక్టర్ డాక్టర్ జాన్‌పీటర్



నిర్మలగిరి పుణ్యక్షేత్ర డైరెక్టర్ జాన్‌పీటర్‌ను సత్కరిస్తున్న అన్నదాన కాంట్రాక్టర్ కళ్ళే నాగేశ్వరరావు

దేవరపల్లి, జనవరి 1(ఆంధ్రజ్యోతి): మానవాళి సుఖశాంతులతో ఉండాలని ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్నామని విశ్వ మానవాళి నూతన సంవత్సరం సుఖశాంతులతో ఉండాలని గౌరీపట్నం నిర్మలగిరి పుణ్యక్షేత్ర డైరెక్టర్ డాక్టర్ జాన్‌పీటర్ అన్నారు. దేవరపల్లి మండల గౌరీపట్నంలోని నిర్మలగిరి పుణ్య క్షేత్ర ఆవరణలో ఉచిత అన్నదాన కాంట్రాక్టర్ కళ్ళే నాగేశ్వరరావు ఆధ్వర్యంలో నూతన సంవత్సరం సందర్భంగా నిర్మలగిరి పుణ్యక్షేత్ర వర్కర్లకు, అన్నదాన ట్రస్ట్ వర్కర్లకు నిర్మలగిరి హృద యకాలేజీ, స్కూల్ సిస్టర్లకు, పేదలకు జాన్‌పీటర్ దుప్పట్లు, చీరలు, స్వీట్లు 200మందికి పంపిణీ చేశారు. జాన్ పీటర్ మాట్లాడుతూ ప్రతీఏటా నూతన సంవత్సరం సందర్భంగా ఈ పుణ్యక్షేత్రంలో వర్కర్లకు పలు విభాగాలకు చెందిన వారికి, ఫాదర్లకు దుస్తులు అందజేస్తున్న కాంట్రాక్టర్ నాగేశ్వరరావును ఆయన అభినందించారు. ముందుగా పుణ్యక్షేత్ర డైరెక్టర్ జాన్ పీటర్ కళాశాల సిస్టర్స్, పాదర్లను శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఫాదర్ గిరీష్, ఏసుబాబు, శివ, కొమ్మర అనీల్, కందుకూరి శ్యామ్ పాల్గొన్నారు.

దుస్తుల పంపిణీ

గోపాలపురం, జనవరి 1(ఆంధ్రజ్యోతి): నూతన సంవత్సరం సందర్భంగా మానవత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మండలంలోని వేలచింతలగూడెం వృద్ధులు, వికలాంగులైన కొంతమందికి దుప్పట్లు, చీరలను బుధవారం పంపిణీ చేశారు. దాత నామన వీర్రాజు, జొన్నలగడ్డ శేఖర్, లైన్‌మ్యాన్ శేఖర్, త్రినాథ్, దాతల సాయంతో ఈ దుప్పట్లు పంపిణీ చేసినట్లు మానవత సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మానవత మండల అధ్యక్షుడు సంకు సత్యకృష్ణారెడ్డి, కార్యదర్శి కుక్కల కీర్తి కుమార్, మానవత చైర్మన్ జొన్నలగడ్డ రాంబాబు, వైస్ చైర్మన్ చంద్రశేఖర్, కోశాధికారి జి. జోగేంద్రప్రసాద్, కార్యదర్శి కుక్కల కీర్తికుమార్, ఈసీ మెంబర్లు రాధాకృష్ణ, దాత నామన వీర్రాజు, జొన్నలగడ్డ శేఖర్, లైన్‌మ్యాన్ శేఖర్, త్రినాధ్, తదితరులు పాల్గొన్నారు.



పేదలకు దుస్తులు పంపిణీ చేస్తున్న మానవతా సభ్యులు

పారిశుధ్య కార్మికులకు దుస్తుల పంపిణీ



దుస్తులు పంపిణీ చేస్తున్న సర్పంచ్ అచ్యుత సత్యనారాయణ

నల్లజర్ల, జనవరి1(ఆంధ్రజ్యోతి): నల్లజర్ల మండలం ఆవపాడు గ్రామ పంచాయతీలో ఉన్న పారిశుధ్య కార్మికులకు, వార్డు సభ్యులకు మొత్తం 40మందికి ఆవపాడు జనసేన సర్పంచ్ అచ్యుత సత్యనారాయణ దుస్తులు, బహుమతులు అందించారు. నూతన వస్త్రాలు,బహుమతులు అందించిన సర్పంచ్ సత్యనారాయణను పారిశుధ్య కార్మికులు అభినందించారు.

డీఏ, పీఆర్‌సీ బకాయిలు వెంటనే చెల్లించాలి

• యూటీఎఫ్ డిమాండ్



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి సీహెచ్ మనోహర్

నల్లజర్ల, జనవరి 1(ఆంధ్రజ్యోతి):ఉపాధ్యాయులకు డీఏ,పీఆర్‌సీ బకాయిలను వెంటనే చెల్లించాలని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి సీహెచ్ మనోహర్ కుమార్ డిమాండ్ చేశారు. నూతన సంవత్సరం పురష్కరించుకుని నల్లజర్ల ప్రాథమిక పాఠశాలలో విలేకర్లతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. ఈ సంద ర్భంగా యూటీఎఫ్ నాయకులు మాట్లాడుతూ హైస్కూల్ ప్లస్‌ను కొనసాగించాలని, యాప్‌ల భారం తగ్గించాలి, 117జీవోను రద్దు చేసి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు 3,4,5 తరగతులను ప్రాథమిక పాఠశాలలో కొనసాగించాలని పేర్కొన్నారు. యూటీఎఫ్ స్వర్ణోత్సవ వేడుకలు కాకినాడలోనే పీఆర్ కళాశాల గ్రౌండ్‌లో ఈనెల 5,6,7,8 తేదీలో జరుగనున్నట్లు తెలిపారు. ఈ సభకు ఉపాధ్యాయులు తరలిరావాలని కోరారు. గౌరవాధ్యక్షులు పల్లి వెంకట అప్పారావు, ప్రధాన కార్యదర్శి బండి కిషోర్,టి నాగేశ్వరరావు, హేమంత్ కుమార్, యస్ రాంబాబు పాల్గొన్నారు.

క్యాలెండర్, డైరీ ఆవిష్కరణ

కొవ్వూరు, జనవరి 1 (ఆంధ్రజ్యోతి) : కొవ్వూరు మండల గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల సంఘం నూతన సంవత్సర క్యాలెండర్, డైరీని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు ఆవిష్కరించారు. బుధవారం కొవ్వూరు నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో క్యాలెండర్, డైరీలను ఆవిష్కరించి, నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. మండలంలోని ఎంఈవోలు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్రికెట్ పోటీలకు క్రీడామైదానం సిద్ధం

గోపాలపురం, జనవరి 1(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి సంబరాల నిర్వహణలో భాగంగా మండలంలోని వేలచింతలగూడెంలో క్రికెట్ పోటీలకు క్రీడామైదానాన్ని బుధవా రం సిద్ధం చేశారు. జనవరి 2నుంచి 11వ తేదీ వరకు జరిగే ఈ పోటీల్లో రాష్ట్ర నలుమూలల నుంచి 16 క్రికెట్ బృందాలు పాల్గొంటున్నా యన్నారు. సంక్రాంతి సంబరాల కమిటీ ఆధ్వర్యంలో ఈ క్రీడలను స్థానిక ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు, ఆర్ అండ్‌ఎం ఫౌండేషన్ చైర్మన్ గంటా మధు, గురువారం ప్రారంభించి అనంతరం పోటీలు ప్రారంభమవుతాయన్నారు.



వేలచింతలగూడెంలో సంక్రాంతి సంబరాల్లో భాగంగా క్రికెట్ పోటీలకు సిద్ధంచేసిన క్రీడా మైదానం

సూర్యదేవర రంజిత్‌కు శాశ్వత సభ్యత్వం



సూర్యదేవర రంజిత్‌కు రూ.లక్ష టీడీపీ శాశ్వత సభ్యత్వం అందజేస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు

కొవ్వూరు, జనవరి 1 (ఆంధ్రజ్యోతి) : కొవ్వూరు పట్టణానికి చెందిన సూర్యదేవర రంజిత్ రూ.లక్ష చెల్లించి టీడీపీ శాశ్వత సభ్యత్వం తీసుకున్నారు. బుధవారం టీడీపీ నియోజకవర్గ కార్యాలయంలో ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు సూర్యదేవర రంజిత్‌కు రూ.లక్ష శాశ్వత సభ్యత్వాన్ని అందజేశారు. నియోజకవర్గంలో శాశ్వత సభ్యత్వం తీసుకున్న రెండవ వ్యక్తి రంజిత్ అన్నారు. కార్యక్రమంలో అర్బన్‌బ్యాంకు చైర్మన్ మద్దిపట్ల శివరామకృష్ణ, మాజీ మున్సిపల్ చైర్మన్ సూరపనేని చిన్ని తదితరులు పాల్గొన్నారు.

కొవ్వూరు పట్టణ బీజేపీ అధ్యక్షుడిగా సందీప్‌కుమార్

కొవ్వూరు, జనవరి 1 (ఆంధ్రజ్యోతి) : కొవ్వూరు పట్టణ బీజేపీ అధ్యక్షుడిగా సలాది సందీప్ కుమార్‌ను ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. బుధవారం కొవ్వూరు పరిమి రామారాయుడు, రత్తమ్మ కళ్యాణ మండపంలో పట్టణ కమిటీ ఎన్నికలు రిటర్నింగ్ అధికారిని అనూరాధ ఆధ్వర్యంలో నిర్వహించారు. సందీప్‌కుమార్‌ను ఏకగ్రీవంగా పట్టణ అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పరిమి రాధాకృష్ణ మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి కృషిచేయాలన్నారు. నూతన అధ్యక్షుడు సందీప్‌కుమార్ మాట్లాడుతూ పట్టణంలోని 23వార్డులలో బీజేపీని బలోపేతం చేయడానికి తనవంతు కృషిచేస్తానన్నారు. కార్యక్రమంలో కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు పిక్కి నాగేంద్ర, అసెంబ్లీ కోఆర్డినేటర్ మాట్ల ఆంజనేయులు, బీవీ ముత్యాలరావు, టి.ఉదయభాస్కర్, కె.రవితేజ, తదితరులు పాల్గొన్నారు.



కొవ్వూరు పట్టణ బీజేపీ అధ్యక్షుడు సలాది సందీప్‌ను సత్కరిస్తున్న బీజేపీ నాయకులు

విశ్వవిద్యాలయ అభివృద్ధికి సహకరించాలి

• నన్నయ ఉపకులపతి ఆచార్య శ్రీనివాసరావు



నన్నయ విశ్వవిద్యాలయం క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న వీసీ శ్రీనివాసరావు

దివాన్‌చెరువు, జనవరి 1 (ఆంధ్రజ్యోతి) : ప్రతీఒక్కరూ తమపనిని త్రికరణశుద్ధిగా నిర్వహిస్తూ విశ్వవిద్యాలయ అభివృద్ధికి సహకరించాలని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య వై.శ్రీనివాసరావు అన్నారు. నన్నయ విశ్వవిద్యాలయం 2025 క్యాలెండర్‌ను బుధవారం ఆయన ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత నూతన సంవత్సరంలో నన్నయ విశ్వవిద్యాలయ ప్రాంగణాలు, అనుబంధ కళాశాలల సిబ్బంది విద్యార్థులు అంతా నూతన లక్ష్యాలను ఎంచుకుని వాటిని సాకారం చేసేందుకు కృషి చేయాలన్నారు. కొత్తసంవత్సరంలో విద్య, ఉద్యోగాలలో ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం విశ్వవిద్యాలయంలోని అన్నివిభాగాలను వీసీ స్వయంగా సందర్శించి అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బందికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, విశ్వవిద్యాలయ అధికారులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

కొవ్వూరు	
యువరాజ్‌మాల్ స్క్రీన్1	: ముఫాస
వై.స్క్రీన్2	: క్రావెన్ ధ హంటర్, మార్కో
దేవిశ్రీ (గాయత్రి	:
అనన్య	: పుష్ప-2
నిడదవోలు	
వీ మ్యాక్స్	: పుష్ప-2
రాధాకృష్ణ	: ముఫాస
శ్రీగణపతి	: మార్కో
దేవరపల్లి	
శ్రీరామ్‌నాథ్ సినీ మ్యాక్స్	: పుష్ప-2
త్రినాథ్ సినీ మ్యాక్స్	: పుష్ప-2